మన క్రాంతి
KR TV
ఇది వాస్తవ పత్రిక...
Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati
సంపుటి : 01 సంచిక :99 | ఆదివారం 09 మార్చి 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు : 8 వెల: 3 రూ/-




# మీ అన్నగా మాట ఇస్తున్నా..

## మిమ్మల్ని కోటీశ్వరులను చేస్తా : సీఎం రేవంత్



గత పదేళ్లు రాష్ట్రానికి చంద్రగ్రహణం పట్టిందని.. ఇప్పుడు చంద్రగ్రహణం అంతరించడంతో తెలంగాణలో మహిళలు స్వేచ్ఛగా ఉన్నారని సీఎం రేవంత్ రెడ్డి పరోక్షంగా బీఆర్ఎస్?పై విమర్శలు గుప్పించారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్??లో ప్రభుత్వ ఆధ్వర్యంలో మహిళా శక్తి సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్.. మహిళా సంఘాలకు ఆర్టీసీ బస్సులను అప్పగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో ఇందిరమ్మ పాలన రావాలని మహిళలు కోరుకున్నారని.. వారి కోరిక తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు.

2 లో

# మహిళల భాగస్వామ్యంతోనే

## తెలంగాణ ప్రగతి : కేసీఆర్



ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర మహిళలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్త్రీశక్తి ని కొనియాడారు. కుటుంబ వ్యవస్థను ముందుకు నడపడంలో మహిళల త్యాగం మహోన్నతమైనదన్నారు. దేశ సంపదను సృష్టించడంలో పౌరులుగా వారి పాత్ర గొప్పదన్నారు. ఎన్నో కష్టాలను అధిగమిస్తూ పురుషుడితో సమానంగా నేటి సమాజంలో స్త్రీ పోశిస్తున్న పాత్ర అమోఘమని తెలిపారు. అవకాశాలిస్తే అబల సబలగా నిరూపించుకుంటుందన్నారు.

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర మహిళాభ్యున్నతికోసం అమలు చేసిన పలు కార్యక్రమాలు వారి సాధికారతకు దోహదం చేయాశయని కేసీఆర్ గుర్తుచేశారు. మహిళల ఆరోగ్యం, సంరక్షణ, సంక్షేమం తో పాటు పలు కీలక అభివృద్ధి పథకాలల్లో మహిళకే ప్రాధాన్యతనిచ్చామన్నారు. వారి కేంద్రంగానే పథకాలను అమలు చేశామని కేసీఆర్ తెలిపారు. తెలంగాణ ప్రగతిలో మహిళలను నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం భాగస్వామ్యం చేసిందన్నారు. అదే స్పూర్థిని కొనసాగిస్తూ మహిళాసాధికారతకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. వారిని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దడం ద్వారానే తెలంగాణ అభివృద్ధి మరింత ముందుకు సాగుతుందని చెప్పారు.

# చాకలి ఐలమ్మ వర్శిటీలో చదివిన ప్రతి బిడ్డ ప్రపంచ స్థాయిలో రాణించాలి : సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ కోఠి ఉమెన్స్ కాలేజీకి వందేళ్ల చరిత్ర ఉందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. ఈ వర్శిటీకి చాకలి ఐలమ్మ పేరు పెట్టడం గొప్ప కీర్తి అని అన్నారు. చాకలి ఐలమ్మ మహిళా వర్శిటీలో పలు నూతన భవనాలకు మార్చి 8న శంకుస్థాపన చేశారు రేవంత్ . ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. వర్శిటీ అభివృద్ధి పనులకు రూ. 500 కోట్లు కేటాయిస్తున్నామని చెప్పారు. ఈ యూనివర్శిటీ అంతర్జాతీయ యూనివర్శిటీలతో పోటీ పడాలన్నారు. ఇక్కడ చదివిన ప్రతి ఆడబిడ్డ ప్రపంచ స్థాయిలో రాణించాలన్నారు. రెండున్నరేళ్లలో వర్శిటీ నిర్మాణం పూర్తవుతుందన్నారు. వర్శిటీ నిర్మాణానికి నిధుల ఢోకా ఉండదన్నారు రేవంత్ .హైదరాబాద్ కోఠి ఉమెన్స్ కాలేజీకి వందేళ్ల చరిత్ర ఉందన్నారు సీఎం రేవంత్ రెడ్డి.

2 లో

## 600 ఆర్టీసీ బస్సులకు

# మహిళలే ఓనర్లు

### : డిప్యూటీ సీఎం భట్టి

గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో డ్వాక్రా సంఘాల గురించి మర్చిపోయిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విమర్శించారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం (మార్చి 8) సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో శనివారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్?లో మహిళా శక్తి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరై ప్రసగించారు. గత కాంగ్రెస్ పాలనలో డ్వాక్రా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇచ్చారు..కానీ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక పదేళ్ల పాటు డ్వాక్రా సంఘాలను పట్టించుకోలేదని మండిపడ్డారు.



2 లో

# మహిళలు కోటీశ్వరులు కాదు.. అప్పులపాలయ్యే పరిస్థితి వచ్చింది..

## కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్‌రావు ఫైర్



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెప్పి కోతలు కోసిన రేవంత్ రెడ్డి.. ఏడాదిన్నర పాలనలో మహిళలను చేసింది ఎడతెగని వంచనే అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో మహిళలు కోటీశ్వరులు కాదు.. అప్పులపాలయ్యే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు.

2 లో

## సీఎం రేవంత్ రెడ్డికి మందకృష్ణ మాదిగ బహిరంగ లేఖ



2 లో

సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ పూర్తిగా జరిగే వరకు అన్ని రకాల ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలను నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 12 నుంచి అసెంబ్లీ సమావేశాలు ఉన్నందున అందులో చట్టం చేస్తామని హామీ ఇచ్చారు. మళ్లీ గ్రూప్ 1 గ్రూప్ 2 గ్రూప్ 3 పరీక్ష ఫలితాలు విడుదల విడుదల చేస్తామని టీజీపీఎస్సీ ప్రకటన చేసింది.

# కాంగ్రెస్‌లో ఉంటూ బీజేపీ కోసం పనిచేస్తున్నారు..

## సొంత పార్టీ నేతలపై రాహుల్ సంచలన ఆరోపణలు

సొంత పార్టీ నేతలపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గుజరాత్ కాంగ్రెస్ లోని కొందరు నేతలు బీజేపీకి బీటీమ్‌గా పనిచేస్తున్నారని ఆరోపించారు. బీజేపీతో కలిసి పనిచేసే వారిని పార్టీ నుంచి బహిష్కరిస్తామని హెచ్చరించారు.

గుజరాత్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి రాహుల్ ప్రసంగించారు. రాష్ట్రంలో మన బాధ్యతలను నెరవేర్చనంత వరకూ అధికారం ఇవ్వాలని గుజరాత్ ప్రజలను అడగకూడదని వ్యాఖ్యానించారు.

2 లో



## నేటిమాట

"పని మీద ప్రేమ ఉంటే, విజయమే మన దగ్గరకు వస్తుంది."



- ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం

# ఆ బస్సులకు

## సకాలంలో కిరాయి చెల్లిస్తారా?: ఎమ్మెల్సీ కవిత



2 లో

మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయకపోవడంతో మహిళలు రాజకీయంగా నష్టపోతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని జనగణనతో ముడిపెట్టి కేంద్రం ఇప్పటికీ అమలు చేయడం లేదని విమర్శించారు. మహిళా రిజర్వేషన్లు అమలుకానందు వల్ల మహారాష్ట్ర, ఢిల్లీ, హర్యాన వంటి ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లో మహిళలు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. జనగణనకు బడ్జెట్‌లో నిధులు ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు.

# అఖిలపక్ష ఎంపీల సమావేశంలో కీలక అంశాలపై చర్చ

- 28 అంశాలపై చర్చించాం
- రాష్ట్ర ప్రయోజనాల కోసం అంతా ఏకం కావాలి
- డిప్యూటీ సీఎం మల్లు




## రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగంపై కీలక అప్డేట్..

## రూ.18,772 కోట్లతో..

## కేంద్ర మంత్రి ప్రకటన




2 లో

తెలంగాణ అభివృద్దే ధ్యేయంగా రాష్ట్ర వ్యాప్తంగా 10 జాతీయ రహదారులను ఇప్పటికే పూర్తి చేశామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వివరించారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కిషన్ రెడ్డి.. రూ.6,280 కోట్ల వ్యయంతో 285 కిలో మీటర్ల మేర కొత్తగా జాతీయ రహదారులను నిర్మించినట్టు స్పష్టం చేశారు.

KR TV మన క్రాంతి ఇది వాస్తవ పత్రిక...



## మహిళలు కోటీశ్వరులు కాదు.. అప్పులపాలయ్యే పరిస్థితి వచ్చింది.. కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్‌రావు ఫైర్

మొదటి పేజీ తరువాయి

ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు మిగిలింది ఎడతెగని వేదనే. మహిళలను కోటీశ్వరులను కాదు, కనీసం లక్షాదికారులుగా చెయ్యని చేతగాని సర్కారు మీది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఏడాదిన్నర పాలనలో మహిళలకు ఏం చేసారని నేడు వేడుకలు నిర్వహిస్తున్నారు అని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఏటా 20వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు మహిళలకు ఇస్తామని ఎన్నికల సమయంలో ఊదరగొట్టారు. చేసింది గోరంత, చెప్పుకునేది కొండంత అన్నట్లుంది కాంగ్రెస్ తీరు. డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఇచ్చిన సమాధానం ప్రకారం, సుమారు రూ. 5 వేల కోట్ల వడ్డీ లేని రుణాల బకాయి ఉంది. బకాయిలే చెల్లించని కాంగ్రెస్ ప్రభుత్వం, ఐదేళ్లలో లక్ష కోట్ల రుణాలు ఎలా ఇస్తుంది? కాంగ్రెస్ ప్రభుత్వ తీరు వల్ల మహిళలు కోటీశ్వరులు కాదు, అప్పుల పాలయ్యే పరిస్థితి వచ్చిందని హరీశ్‌రావు విమర్శించారు.

ఇందిరా మహిళా శక్తి పేరిట వేడుకలు నిర్వహించడం సిగ్గుచేటు..

'మహిళలకు ప్రతి నెలా రూ. 2500' ఇస్తామని ఆరు గ్యారెంటీల్లో మొట్ట మొదటి హామీగా చెప్పి ఏడాదిన్నరగా అమలు చేయని రేవంత్ సర్కారు, ఈరోజు ఇందిరా మహిళా శక్తి పేరిట వేడుకలు నిర్వహించడం సిగ్గుచేటు. మహాలక్ష్మి పథకం కింద రాష్ట్రంలోని ప్రతి మహిళకు బకాయి పడ్డ రూ. 37,500 ఎప్పుడు చెల్లిస్తారు? రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటితే, చేతలు మాత్రం గడప దాటవు అని మరోసారి నిరూపితమైంది. గ్యారెంటీలు, 420 హామీలు అని అన్ని వర్గాల ప్రజలను మోసం చేసినట్లే రేవంతు సర్కారు, మహిళలను దారుణంగా వంచించింది. ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా, కేసీఆర్ గారు మహిళా సంక్షేమం, సాధికారత, స్వయం సమృద్ధి కోసం ప్రారంభించిన పథకాలకు మంగళం పాడారు అని హరీశ్‌రావు విమర్శించారు.

ఎన్నికలకు ముందు అరచేతిలో వైకుంఠం..

ఇందిరమ్మ రాజ్యంలో%౹%౹% కేసీఆర్ కిట్టు బంద్ అయ్యింది. కేసీఆర్ న్యూట్రీషన్ కిట్ బంద్ అయ్యింది. బతుకమ్మ చీరెలు బంద్ అయినయి. ఆరోగ్య లక్ష్మి బంద్ అయ్యింది. ఆరోగ్య మహిళ బంద్ అయ్యింది. పింఛన్ల పెంపు బంద్ అయ్యింది. కడుపు కోతలు మల్లా పెరిగినయి. పెరిగిన క్రైం రేటుతో ఆడబిడ్డలకు భద్రత కరువైంది. నోటిఫికేషన్లు రాక, యువతుల ఉద్యోగ కలల సాకారం ప్రశ్నార్థకమైంది. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినవి అమలు చేయకుండా ఇన్నాళ్లూ కాలం వెల్లదీసారు. ఇప్పుడమో అన్నీ చేసినట్లు, మహిళలను కోటీశ్వరులను చేసినట్లు కోట్లు ఖర్చు చేసి ప్రచారం చేసుకుంటున్నారు. ఎన్నికలకు ముందు అరచేతిలో వైకుంఠం, అధికారంలోకి వచ్చాక అబద్దాలు ప్రచారం చేసుకుంటం అన్నట్లుంది కాంగ్రెస్ వైఖరి అని హరీశ్‌రావు మండిపడ్డారు.

నేడు వేడుకలు జరుపుకోవడం నవ్విపోదురు గాక నాకేంటి సిగ్గు అన్నట్లుంది..

మీ అభయహస్తం మేనిఫెస్టోలో చెప్పి, ఏడాదిన్నరగా మాట తప్పిన హామీలను గుర్తు చేస్తున్నాను. మహాలక్ష్మి కింద ప్రతి మహిళకు నెలకు రూ. 2500. ఇప్పటికీ అమలు లేదు. సంవత్సరానికి 20వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇస్తమన్నరు. అతీగతీ లేదు. 18 ఏళ్లు పైబడి, చదువుకునే ప్రతీ యువతికి ఎలక్ట్రిక్ స్కూటర్ ఇస్తమన్నరు. ఊసే లేదు. ఆడబిడ్డ పెళ్లికి లక్ష ఆర్థిక సాయంతో పాటు, తులం బంగారం ఇస్తామన్నరు. జాడే లేదు. మహిళా పారిశ్రామికవేత్తల కోసం నైపుణ్య శిక్షణా కేంద్రంతో పాటు, ప్రత్యేక నిధి ఏర్పాటు చేస్తమన్నరు. పత్తాలేదు. డ్వాక్రా సంఘాలకు పక్కా భవనాలు నిర్మిస్తం అన్నరు. ప్రస్తావన లేదు. పుట్టిన ప్రతి ఆడ బిడ్డకు ఆర్థిక సాయంతో కూడిన 'బంగారు తల్లి' పథకాన్ని పునరుద్దరిస్తం అన్నరు. పథకమే లేదు. అంగన్‌వాడీ టీచర్లకు నెలసరి వేతనం 18,000 లకు పెంచుతూ, ఇపిఎఫ్ పరిధిలోకి తెచ్చి ఉద్యోగ భద్రత కల్పిస్తం అన్నరు. ఆలోచనే లేదు. ఆశా వర్కర్లకు తక్షణమే వేతనాలు పెంచుతం అన్నరు. సోయి లేదు. ఇందులో ఒక్క హామీని అమలు చేయకుండా, నేడు వేడుకలు జరుపుకోవడం నవ్విపోదురు గాక నాకేంటి సిగ్గు అన్నట్లుందని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైంది..

ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైంది. మహిళల పై అత్యాచారాలు, లైంగిక వేధింపుల ఘటనలు నిత్యకృత్యమయ్యాయి. మహిళలపై నేరాలు అడ్డు అదుపు లేకుండా పెరిగిపోతున్నాయి. మహిళా రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయి. గురుకులాల్లో విద్యార్థినులు బలవన్మరణాలకు పాల్పడుతుండటం దారుణం. మహిళా సాధికారికత, భద్రత మాటలకే పరిమితమైంది. ఈ ప్రభుత్వానికి నిజంగా మహిళల పట్ల గౌరవం ఉంటే, వారి సంక్షేమం పట్ల చిత్తశుద్ధి ఉంటే నేడు జరిగే ఇందిరా మహిళా శక్తి వేడుకల్లో ఈ హామీల అమలు ఖచ్చితమైన తేదీలను ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నాం. ఏడాదిన్నర పాలనలో కాంగ్రెస్ చేసిన మోసానికి గాను నేడు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ వేదికగా జరిగే మహిళా దినోత్సవ వేడుకల్లో యావత్ కాంగ్రెస్ పార్టీ తరుపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## చాకలి ఐలమ్మ వర్శిటీలో చదివిన ప్రతి బిడ్డ ప్రపంచ స్థాయిలో రాణించాలి : సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్ కోఠి ఉమెన్స్ కాలేజీకి వందేళ్ల చరిత్ర ఉందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. ఈ వర్శిటీకి చాకలి ఐలమ్మ పేరు పెట్టడం గొప్ప కీర్తి అని అన్నారు. చాకలి ఐలమ్మ మహిళా వర్శిటీలో పలు నూతన భవనాలకు మార్చి 8న శంకుస్థాపన చేశారు రేవంత్ . ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. వర్శిటీ అభివృద్ధి పనులకు రూ. 500 కోట్లు కేటాయిస్తున్నామని చెప్పారు. ఈ యూనివర్శిటీ అంతర్జాతీయ యూనివర్శిటీలతో పోటీ పడాలన్నారు. ఇక్కడ చదివిన ప్రతి ఆడబిడ్డ ప్రపంచ స్థాయిలో రాణించాలన్నారు. రెండున్నరేళ్లలో వర్శిటీ నిర్మాణం పూర్తవుతుందన్నారు. వర్శిటీ నిర్మాణానికి నిధుల ధోకా ఉండదన్నారు రేవంత్ .

అవకాశం ఇస్తే అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తారని అన్నారు రేవంత్. రాజీవ్ గాంధీ మహిళా రిజర్వేషన్లు తీసుకొచ్చారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామన్నారు సీఎం రేవంత్. మహిళలకు ఏ పాత్ర ఇచ్చినా సమర్థవంతంగా నిర్వహిస్తారని చెప్పారు. దేశం అభివృద్ధి చెందాలంటే మహిళల భాగస్వామ్యం పెరగాలన్నారు. తాము అధికారంలోకి వచ్చాక మహిళలకు బస్సుల్లో ఫ్రీ జర్నీ అవకాశం కల్పించామన్నారు. అదానీ అంబానీలతో పోటీపడేలా మహిళలను ప్రోత్సహిస్తున్నామన్నారు రేవంత్ రెడ్డి.

## 600 ఆర్టీసీ బస్సులకు మహిళలే ఓనర్లు: డిప్యూటీ సీఎం భట్టి

గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో డ్వాక్రా సంఘాల గురించి మర్చిపోయిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విమర్శించారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం (మార్చి 8) సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో శనివారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్?లో మహిళా శక్తి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరై ప్రసగించారు. గత కాంగ్రెస్ పాలనలో డ్వాక్రా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇచ్చారు..కానీ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక పదేళ్ల పాటు డ్వాక్రా సంఘాలను పట్టించుకోలేదని మండిపడ్డారు.

మేం అధికారంలోకి వచ్చాక.. మహిళ స్వయం సహయ సంఘాలకు ఏడాదికి రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇందులో భాగంగా.. ఈ ఏడాది రూ.21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలు.. వివిధ వ్యాపారాలు చేసే విధంగా ఒప్పందాలు చేశామని.. ఇందులో భాగంగానే మహిళ స్వయం సహాయ సంఘాలకు ఆర్టీసీ బస్సులను ఇచ్చామన్నారు. మహిళలు ఇవాళ 600 ఆర్టీసీ బస్సులకు యజమానులు అయ్యారని అన్నారు.

అలాగే.. 1000 మెగావాట్ల సోలార్ విద్యుత్?ను డ్వాక్రా మహిళలు ఉత్పత్తి చేయబోతున్నారని తెలిపారు. తెలంగాణ ఆర్థిక అభివృద్ధికి మహిళలే పునాదులు కావాలని ఆకాంక్షించారు. ఆదర్శ పాఠశాలల నిర్వహణ బాధ్యతలను కూడా మహిళలకే అప్పజెప్పామని గుర్తు చేశారు. గతంలో మహిళలకు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.10 వేల కోట్లు అయినా ఇచ్చిందా..? గతంలో పేదలు చదువుకునే పాఠశాలలు, కళాశాలల గురించి పట్టించుకున్నారా..? అని ప్రశ్నించారు. మహిళల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు.

## ఆ బస్సులకు సకాలంలో కిరాయి చెల్లిస్తారా?: ఎమ్మెల్సీ కవిత

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జనగణన త్వరగా పూర్తిచేస్తే.. రాబోయే బీహార్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో మరింత మంది మహిళలు ఎమ్మెల్యేలుగా అవుతారన్నారు.

ప్రతీ మహిళకు రూ.2500 ఇస్తామన్న హామీని అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంటాడుతామని చెప్పారు. మహిళా సంఘాల ద్వారా కిరాయికి తీసుకుంటున్న బస్సులకు ఆర్టీసీ సకాలంలో కిరాయి చెల్లిస్తుందో లేదో స్పష్టత ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం జీతాలు పెంచకపోవడం సరికాదని విమర్శించారు. మహిళలను ఎలా కోటీశ్వరులను చేస్తారో నిర్దిష్టమైన ప్రణాళికను ప్రభుత్వం బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

కేసీఆర్ మహిళా కేంద్రీకృత పాలన చేశారని వెల్లడించారు. మహిళల కోసం అనేక పథకాలు, కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. కేసీఆర్ పెట్టిన పథకాలను తీసేసే కర్కోటక ప్రభుత్వం రాష్ట్రంలో ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేరళ ప్రభుత్వ పాఠ్య పుస్తకాల్లో మహిళా, పురుషుల సమానత్వపు బొమ్మలు ప్రచురిస్తున్నారని వెల్లడించారు. అలాంటి చర్యలు తెలంగాణలో కూడా రావాల్సి ఉందన్నారు.

'సమాజం ఎదుగుదలలో మహిళల పాత్ర గణనీయం. ప్రపంచ వ్యాప్తంగా మహిళలకు సమాన హక్కులు, గౌరవం, నిర్ణయాధికారం రావాల్సి ఉంది. అప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుంది. చిట్యాల ఐలమ్మ, రాణి రుద్రమాదేవి వంటి వీర మహిళలు తెలంగాణ గడ్డపై పుట్టడం మనకు గర్వకారణం. మహిళలకు కులమతాలు లేవు.. మహిళలది ఒకే కులం. మహిళలలు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలి. ఇళ్లలో మహిళలు ద్వితియ శ్రేణి పౌరులుగా ఉంటున్నారన్న వాదన వీగిపోవాలి. అమెరికాలో 40 శాతం మహిళలు ఉద్యోగాలు చేస్తుంటే, భారత్‌లో మాత్రం అది 17 శాతంగానే ఉంది. దేశంలో 50 శాతం మహిళలు ఉద్యగాలు చేస్తే దేశ జీడీపీకి మనం 5 లక్షల కోట్ల ఆదాయం ఇవ్వగలుగుతాం. కానీ మహిళలు ఉద్యోగాలు చేయదగడానికి గల సౌకర్యాలు ఉన్నాయా అన్నది ఆలోచించాలి. భూగర్భ గనులల్లో పనిచేయడం నుంచి అంతరిక్షంలోకి వెళ్లే వరకు మహిళలు ఎదిగారు. అయినా అనేక అవాంతరాలు ఉన్నాయి. వాటిని అధిగమించాల్సిన అవసరం ఉంది' అని చెప్పారు.

## రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగంపై కీలక అప్డేట్.. రూ.18,772 కోట్లతో.. కేంద్ర మంత్రి ప్రకటన

మొదటి పేజీ తరువాయి

ఇప్పటికే పూర్తయిన రహదారులను త్వరలోనే ప్రారంభించనున్నట్టు ప్రకటించిన కిషన్ రెడ్డి.. ఈ ప్రారంభోత్సవానికి రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ రానున్నట్టు తెలిపారు.

మరోవైపు.. రేవంత్ రెడ్డి సర్కార్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రీజినల్ రింగ్ రోడ్డు గురించి కూడా మంత్రి నితిన్ గడ్కరీతో చర్చించినట్టు తెలిపారు. ఫైనాన్స్‌కు సంబంధించి ట్రై పార్టీ అగ్రిమెంట్ జరగాల్సి ఉందని కిషన్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి రూ.18,772 కోట్లు ఖర్చు అవుతోందని అంచనా వేసిన అధికారులు.. అందుకు సంబంధించిన అంచనా వ్యయాన్ని కూడా అధికారులు ఇప్పటికే సిద్ధం చేశారని పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్ర కేబినెట్ నోట్ కూడా ప్రిపేర్ అవుతున్నట్లుగా కిషన్ రెడ్డి తెలిపారు.

మరోవైపు.. ఆరాంఘర్ నుంచి శంషాబాద్‌కు ఆరు లేన్ల హైవే కూడా ఇప్పటికే పూర్తయిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్లే వాళ్ల కోసం సిగ్నల్ ఫ్రీ రోడ్డు కూడా పూర్తయిందని చెప్పుకొచ్చారు. వీటితో పాటు.. బీహెచ్ఈఎస్ ఫ్లైఓవర్ కూడా తుదిదశకు చేరుకుందని.. వచ్చే నెలలో పూర్తవుతుందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. బీహెచ్ఈఎల్ ఫ్లై ఓవర్ పూర్తయితే కూకట్‌పల్లి పటాన్‌చెరు మధ్య ట్రాఫిక్ కంట్రోల్ అవుతుందని కిషన్ రెడ్డి చెప్పుకొచ్చారు.

మరోవైపు.. కేంద్రం, తెలంగాణల మధ్య పరిష్కారం కాని సమస్యలపై చర్చించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం శనివారం ప్రజా భవన్‌లో అన్ని పార్టీల ఎంపీలతో సమావేశం నిర్వహించగా.. ఈ భేటీకి బీజేపీ ఎంపీలు హాజరుకాలేదు. ఇందుకు సంబంధించి.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కిషన్ రెడ్డి లేఖ కూడా రాశారు. తమ పార్టీ ఎంపీలకు ఆహ్వానం ఆలస్యంగా అందిందని లేఖలో తెలిపారు. ఎంపీలకు నియోజకవర్గాల్లో ముందస్తు కార్యక్రమాలు ఉన్నాయని.. ముందుగా నిర్ణయించిన కార్యక్రమాల వల్ల సమావేశానికి రాలేకపోతున్నామని లేఖలో వెల్లడించారు. భవిష్యత్‌లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే ముందస్తుగా సమాచారం ఇవ్వాలని సూచించారు.

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం.. తెలంగాణ అభివృద్ధికి అన్ని విధాల కట్టుబడి ఉందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. పదేళ్లలో తెలంగాణకు కేంద్రం రూ.10 లక్షల కోట్లు ఖర్చు చేసిందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. చిత్తశుద్ధి, అంకితభావంతో తెలంగాణ అభివృద్ధికి ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తూనే ఉంటుందని కిషన్ రెడ్డి మరోసారి ఉద్ఘాటించారు.

## ప్రపంచంలోనే అత్యధిక ధనికుడిని నేనే.. ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన సొంత రాష్ట్రం గుజరాత్‌లో పర్యటించారు. నవ్‌సరి జిల్లాలో ఏర్పాటు చేసిన ఓ బహిరంగ సభలో పాల్గొన్న ప్రధాని మోదీ.. కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలో తానే అత్యంత ధనవంతుడినని పేర్కొన్నారు. అయితే అందుకు ఆయన కారణాన్ని కూడా వివరించారు. తాను ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి గత 10 ఏళ్లుగా దేశంలో మహిళల భద్రత కోసం తమ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇచ్చిందని వెల్లడించారు.

మహిళల కోసం సరికొత్త చట్టాలను తీసుకువచ్చినట్లు తెలిపారు. ట్రిపుల్ తలాక్‌కు వ్యతిరేకంగా ముస్లిం మహిళల కోసం చట్టం తీసుకువచ్చినట్లు తెలిపిన మోదీ.. దీని వల్ల లక్షల మంది ముస్లిం మహిళల జీవితాలను కాపాడినట్లు చెప్పారు. మహిళల సారథ్యంలోని ఎన్నో కంపెనీలు ఇప్పుడు విజయవంతంగా నడుస్తున్నాయని పేర్కొన్నారు. కోట్లాది మంది తల్లులు, సోదరీమణుల ఆశీర్వాదం కలిగిన తాను.. ఈ ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిని అని ప్రధానమంత్రి మోదీ చెప్పుకున్నారు.

అంతేకాకుండా మహిళలపై అత్యాచారం వంటి క్రూరమైన నేరాలకు పాల్పడేవారికి మరణశిక్ష విధించేలా చట్టాలను కూడా సవరించినట్లు తెలిపారు. ఇక అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నవ్‌సరి జిల్లాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించిన ప్రధాని మోదీ.. మహిళల నేతృత్వంలో భారత్ అభివృద్ధి పథంలో పయనిస్తోందని తెలిపారు. అయితే ఇంటికి ఒక అమ్మాయి ఆలస్యంగా వస్తే.. తల్లిదండ్రులు ఆమెను ప్రశ్నిస్తారని తెలిపిన ప్రధాని.. అదే అబ్బాయిల విషయంలో మాత్రం అలా జరగదని.. కానీ వారిని కూడా ప్రశ్నించాలని సూచించారు.

గత 10 ఏళ్లలో మహిళల భద్రత, మహిళలపై జరుగుతోన్న నేరాలను అరికట్టేందుకు అధిక ప్రాధాన్యతను ఇచ్చినట్లు వివరించారు. అందుకోసం నిబంధనలను, చట్టాలను కూడా మార్చినట్లు తెలిపారు. రేప్ సహా ఇతర అలాంటి తీవ్రమైన నేరాల్లో మరణశిక్ష విధించేలా చట్టాలను పటిష్ఠం చేసినట్లు ప్రధాని వెల్లడించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉండే మహిళలకు మరింత సాధికారత కల్పించాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. దేశ ఆత్మ గ్రామాల్లో ఉందని జాతిపిత మహాత్మాగాంధీ చెప్పిన మాటను గుర్తు చేసుకున్న ప్రధాని.. మహిళలు మన గ్రామీణ ప్రాంతాలకు ఆత్మగా దానికి జోడించాలని అనుకుంటున్నట్లు చెప్పారు.

## సీఎం రేవంత్ రెడ్డికి మందకృష్ణ మాదిగ బహిరంగ లేఖ

సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ పూర్తిగా జరిగే వరకు అన్ని రకాల ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలను నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 12 నుంచి అసెంబ్లీ సమావేశాలు ఉన్నందున అందులో చట్టం చేస్తామని హామీ ఇచ్చారు. మళ్లీ గ్రూప్ 1 గ్రూప్ 2 గ్రూప్ 3 పరీక్ష ఫలితాలు విడుదల విడుదల చేస్తామని టీజీపీఎస్సీ ప్రకటన చేసింది. ఎస్సీలకు మరోసారి అన్యాయం జరుగుతుంది" అని లేఖలో మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు.

"ఇంతకుముందు 11 వేల డీఎస్సీ పోస్టులు భర్తీ చేయడం వలన మేము ఎన్ని పోస్టులు నష్టపోయామో మీకు తెలుసు. దయ చేసి ఎస్సీ వర్గీకరణ పూర్తయ్యే వరకు అన్ని పోటీ పరీక్షలను నిలిపివేయండి" అంటూ లేఖలో మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు.

## అఖిలపక్ష ఎంపీల సమావేశంలో కీలక అంశాలపై చర్చ

రాష్ట్ర ప్రయోజనాల కోసం అంతా ఏకం కావాల్సిన అవసరం ఉందని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రజాభవన్ లో అఖిలపక్ష ఎంపీల సమావేశంలో భట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 28 అంశాలపై చర్చ జరిగినట్లు భట్టి తెలిపారు.'కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, హామీలపై చర్చించాం. రాష్ట్రానికి రావాల్సిన అంశాలను కేంద్రం నెరవేర్చాలని కోరుతూ ప్రతిపాదనలు ఇప్పటికే ఇచ్చాం మళ్ళీ ఇస్తాం.

కేంద్రం నుంచి రావాల్సిన పెండింగ్ అంశాలపై చర్చించాం. కేంద్రమంత్రులను కూడా ఆహ్వానించాం.. సమావేశానికి రావాలని బీజేపీ, బీఆర్ఎస్ ఎంపీలను ప్రత్యేకంగా ఆహ్వానించినా రాలేదు. రాష్ట్ర ప్రయోజనాల కోసం అందరూ ఏకం కావాల్సిన అవసరం ఉంది. విభజన చట్టం నుండి రావాల్సిన రాష్ట్ర హక్కుల పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చాం. రెసిడెంట్ కమిషనర్ కార్యాలయం నుండి ఎంపీల అందరికీ వివరాలు పంపిస్తాం.

బీఆర్ఎస్ ఆనాడు చేయాల్సిన ప్రయత్నం సరిగా చేయలేదు. మేము అధికారంలోకి వచ్చాక కొంచెం ఒత్తిడి పెంచాం. పార్లమెంట్ లో కేంద్రం మీద ఒత్తిడి చేయాలని మ ప్రయత్నం. కేంద్రం నుండి రావాల్సిన నిధులు..ప్రాజెక్టులు అందాలి. రాష్ట్ర ప్రయోజనాల కోసం అన్ని పార్టీల ఎంపీలు కలిసి రావాలి. ఇంకో సమావేశం ఏర్పాటు చేసి మళ్ళీ చెప్తం. ముందే సమాచారం ఇస్తాం. అప్పుడైనా బీజేపీ..బిఆర్ఎస్ వాళ్ళు కలిసి వస్తారు. కేంద్రం కి ఇచ్చిన లేఖలు..సమాచారం బుక్ లెట్ గా రూపొందించాం' అని భట్టి పేర్కొన్నారు.

నిధుల కేటాయింపులో తెలంగాణకు అన్యాయం

తెలంగాణ ప్రభుతవం ఏర్పాటు చేసిన అఖిలపక్ష ఎంపీల సమావేశాన్ని స్వాగతిస్తున్నామన్నారు ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ. కేంద్ర ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించడం లేదు. నిధుల కేటాయింపులో తెలంగాణకు అన్యాయం జరుగుతోంది. తెలంగాణపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారు' అని ఓవైసీ అన్నారు.

## మీ అన్నగా మాట ఇస్తున్నా.. మిమ్మల్ని కోటీశ్వరులను చేస్తా: సీఎం రేవంత్

మొదటి పేజీ తరువాయి

పదేళ్ల కేసీఆర్ పాలన, కాంగ్రెస్ పాలన మధ్య ఉన్న తేడాను మహిళలు గమనిస్తున్నారని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు మహిళలను అన్ని రంగాల్లో విస్మరించిందని.. కేసీఆర్ మొదటి టర్మ్?లో ఆయన కేబినెట్?లో ఒక్క మహిళా కూడా లేకపోవడమే ఇందుకు నిదర్శమని విమర్శించారు. రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించి గెలిపించుకుంటామని హామీ ఇచ్చారు. తెలంగాణలో 65 లక్షల మంది మహిళలు స్వయం సహాయ సంఘాల్లో ఉన్నారని.. రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూల్స్ నిర్వహణ వారికే అప్పగించామని తెలిపారు.

గవర్నమెంట్ స్కూల్ పిల్లలకు యూనిఫామ్ కుట్టే బాధ్యతను కూడా మహిళా స్వయం సహాయ సంఘాలకే ఇచ్చామని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో ప్రతి మండలంలో మహిళా సంఘాలకు రైస్ మిల్లులు, గోడౌన్లు కట్టించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మహిళా సంఘాలు కార్పొరేట్ కంపెనీలతో పోటీ పడేలా చేస్తామని.. ఇందుకోసం ప్రతి జిల్లాలో ఇందిరా శక్తి భవనాలు నిర్మిస్తున్నామని చెప్పారు. సోలార్ ఉత్పత్తిలో అదానీ, అంబానీలతో మా ఆడబిడ్డలు పోటీపడేలా చేస్తామని పేర్కొన్నారు.

దివంగత ప్రధాని ఇందిరాను అమ్మ అన్నారు.. దివంగత సీఎం ఎన్టీఆర్?ను అన్నా అన్నారు.. ఇప్పుడు నన్ను రేవంతన్న అంటున్నారు.. మీతో పేగు బంధం కలిగిన మీ అన్నగా మాట ఇస్తున్నా.. మిమ్మల్ని కోటీశ్వరులను చేస్తానని మహిళలకు హామీ ఇచ్చారు సీఎం రేవంత్. ఎండకు పంటలు ఎండిన బీఆర్ఎస్ నేతలు నన్ను తిడుతున్నారు.. ఎక్కడ చిన్నా ప్రమాదం జరిగినా నన్నే దూషిస్తున్నారు.. తనను తిడుతూ బీఆర్ఎస్ నేతలు పైశాచికానందం పొందుతున్నారని ఫైర్ అయ్యారు.

## ఇందిరా మహిళా శక్తి దేశానికి ఘనకీర్తి : మంత్రి సీతక్క



ఇందిరా మహిళా శక్తి దేశానికి ఘనకీర్తి అన్నారు మంత్రి సీతక్క. రాష్ట్రంలోని కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేస్తామన్నారు.మార్చి 8న మహిళా దినోత్సవం సందర్బంగా సికింద్రాబాద్ లో ని పరేడ్ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన సభలో మంత్రి సీతక్క మాట్లాడారు. ఈ సభకు సీఎం రేవంత్ రెడ్డి తోపాటు పలువురు మంత్రులు, మహిళా ప్రముఖులు పాల్గొన్నారు.

600 ఆర్టీసీ బస్సులకు మహిళలను ఓనర్లు చేశామన్నారు. మహాలక్ష్మీ పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా 115 కోట్ల మంది మహిళలు ప్రయాణించారన్నారు. 31 జిల్లాల్లో మహిళా పెట్రోల్ బంక్ లకోసం ఒప్పందం జరిగిందన్నారు.

గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళా సంఘాల సభ్యులకు ప్రమాదబీమా, రుణబీమా కల్పించామన్నారు. పది లక్షల ప్రమాద బీమా , రెండు లక్షల వరకు లోన్ బీమా ఇస్తున్నట్లు మంత్రి సీతక్క చెప్పారు. మహిళలకోసం పాటుపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మహిళలు దీవించాలని కోరారు.

మహిళల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతుంటే.. కొంతమంది ఓర్వలేకపోతున్నారని మంత్రి సీతక్క విమర్శించారు.

## కాంగ్రెస్‌లో ఉంటూ బీజేపీ కోసం పనిచేస్తున్నారు..

### సొంత పార్టీ నేతలపై రాహుల్ సంచలన ఆరోపణలు

సొంత పార్టీ నేతలపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గుజరాత్ కాంగ్రెస్ లోని కొందరు నేతలు బీజేపీకి బీటీమ్‌గా పనిచేస్తున్నారని ఆరోపించారు. బీజేపీతో కలిసి పనిచేసే వారిని పార్టీ నుంచి బహిష్కరిస్తామని హెచ్చరించారు.

గుజరాత్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి రాహుల్ ప్రసంగించారు. రాష్ట్రంలో మన బాధ్యతలను నెరవేర్చనంత వరకూ అధికారం ఇవ్వాలని గుజరాత్ ప్రజలను అడగకూడదని వ్యాఖ్యానించారు. గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీ రాణించాలంటే... కాంగ్రెస్ పార్టీలో ఉంటూ బీజేపీకి మద్దతిస్తున్న వారిని తొలగించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. 'గుజరాత్‌లో సగం మంది కాంగ్రెస్ నేతలు బీజేపీతో చేతులు కలిపారు. కమలం పార్టీకి అనుకూలంగా పనిచేస్తున్నారు. అలాంటి వారిని బయటకు పంపుతాం. దశాబ్దాలుగా కాంగ్రెస్ అధికారంలో లేని బీజేపీ పాలిత రాష్ట్రంలో పార్టీని ప్రక్షాళన చేయడానికి అవసరమైతే 40 మంది నాయకులను తొలగించడానికి కూడా సిద్ధంగా ఉన్నాం' అని రాహుల్ వ్యాఖ్యానించారు.

# మహిళల హక్కుల రక్షణ కోసం పోరాడాలి

## వివక్ష, భయం లేని సమాజాన్ని తెచ్చుకుందాం

### -కొంపల్లి ముత్తమ్మ మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు



మోత్కూర్ 08 మార్చ్(క్రాంతిన్యూస్ ): సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న వివక్షత, అణిచివేతల నుండి విముక్తిసాధించి సమాజ అభివృద్ధిలో భాగస్వామ్యాన్ని పెంచటంతో పాటు, మహిళల హక్కుల రక్షణ కోసం ఐక్యంగా పోరాడాలని, మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు కొంపల్లి ముత్తమ్మ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా మోత్కూర్ మండలం పాలడుగు గ్రామంలో మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల సమావేశం జరిగింది. అనంతరం ఆమె మాట్లాడుతూ... సనాతన ధర్మాల పేరుతో అనాదిగా మహిళలపై అంక్షలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు. ఆధునిక కాలంలో కూడ, కుల, లింగ వివక్షత, మూడనమ్మకాలు, అవిద్య, అనచారాలు కొనసాగడాన్ని నిరశిస్తూ మహిళలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికి కూడ స్వేచ్ఛ స్వాతంత్యాలకు ఆర్థిక సమానంత్వానికి నోచుకోని అబాగ్యుల కోసం మన వంతు కృషి చేయ్యాలని కోరారు. స్త్రీలకు ఓటు హక్కు, ఆస్థిహక్కు, కనీసం ఒంటినిండా దుస్తువులు కట్టుకునే అర్హతలేక , అందరు తినగా మిగిలింది మాత్రమే తినాలనే నిబంధనల నుండి అన్ని రంగాల్లో శాసించే స్థాయికి మహిళలు ఏదిగారాంటే ఎందరో త్యాగాలు, బలిదానాల వల్ల మాత్రమే సాధించ బడ్డాయన్న విషయాన్ని మరచిపోవద్దని అన్నారు. కేంద్ర ప్రభుత్వ మహిళా సంక్షేమ శాఖ మహిళల సంక్షేమం కోసం అధిక నిధులు కేటాయించినప్పుడే స్త్రీ సాధికారత, సమానత్వానికి పునాది పడుతుందని అన్నారు. జనాభాలో సగభాగంగా ఉన్న మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చట్టం చేసిన పాలకులు డిలిమిటెషన్ పేరుతో వాయిదా వేస్తున్నారని, వెంటనే రిజర్వేషన్లు అమలు చెయ్యాలని ప్రభుత్వాలను డిమాండ్ చేసారు ఈ కార్యక్రమంలో దడిపల్లి నవనీత, చింతకింది లక్ష్మి, వడ్డేపల్లి లక్ష్మి, గుండు కవిత, జెల్ల శాంతమ్మ, గంటెపాక నర్సమ్మ, వెండి కమలమ్మ, బొర్ర లక్ష్మి, దడిపల్లి మాదవి తదితరులు పాల్గొన్నారు.

# సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



మోత్కూర్ 08మార్చ్ ( క్రాంతి న్యూస్ ): ఆలయ ప్రాంగణాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా దొంగతనాలు, ఇతర నేరాలను నియంత్రించవచ్చుని ఎస్ఐ దొమ్మేటి నాగరాజు అన్నారు. మున్సిపల్ కేంద్రానికి చెందిన ఎన్నారై రాపోలు సుదర్శన్ రూ. 31 వేల ఆర్థిక సహాయంతో శ్రీ ఆంజనేయ, సీతారాముల ఆలయాల్లో నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. శనివారం ఈ కెమెరాలను ఎస్ఐ నాగరాజు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి, దాత తల్లి రాపోలు సుగుణమ్మ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నాగరాజు మాట్లాడుతూ, నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ తమ తమ పరిసరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని సూచించారు. దాత సుదర్శన్ దాతృత్వం అభినందనీయమని ఎస్ఐ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు రాపోలు పరందాములు, శోభారాణి, ఆలయ కమిటీ ప్రతినిధులు దంతురి కృష్ణ, పల్లెర్ల వెంకన్న, మాజీ సర్పంచ్ కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ప్రతినిధులు ధబ్బేటి సోంబాబు, అనంతుల అశోక్, మెంట నగేష్, బుంగపట్ల సుదర్శన్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



మోత్కూర్ 08మార్చ్( క్రాంతి న్యూస్ ): యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ పరిధిలో భారతీయ జనతా పార్టీ మోత్కూర్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా రేషన్ డీలర్లను శాలువాతో సన్మానం చేసి మిఠాయిలు పంచడం జరిగినది, ఈ సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షులు చాడ మంజుల బిజెపి సీనియర్ నాయకులు కొనతం నాగార్జున తుంగతుర్తి నియోజకవర్గ కో కన్వీనర్ కూరాకుల వెంకన్న మాట్లాడుతూ భారతదేశంలో మహిళా సాధికారత కోసం మహిళలను ఆర్థిక. సామాజిక. మానసికంగా ఉండే విధంగా సమాజంలో వారి కీలకపాత్రను గుర్తించడానికి భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ, మహిళ ఎదుగుదలకు ప్రారంభించిన పథకాలు. బేటి బచావో బేటి పడావో. ఉజ్వల యోజన. సుకన్య సమృద్ధి యోజన. ప్రధానమంత్రి మాతృ వందన యోజన. ముద్ర యోజన. . స్టాండప్ ఇండియా మిషన్. ద్వారా సమాజంలో గౌరవంగా తల ఎత్తుకొని జీవించే విధంగా ఉన్నారు. అలాగే చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించారు, అని ఈ సందర్భంగా అన్నారు, ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు,శ్రీనివాస్ పోచం సోమయ్య మహిళా మోర్చానాయకులు ఏషాబోయిన రమణ వనం రేణుక పట్టణ నాయకులు జిలకర దశరథ కందుకూరు ప్రకాష్ పుల్కం శివ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు,

# గడ్డివాము దగ్ధం

## రైతుకు రెండు లక్షల అస్తి నష్టం

### - మంటలను అదుపు చేసిన ఫైర్ సిబ్బంది

### - గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి వాము కు నిప్పు పెట్టినట్లు వెల్లడి





పెద్దేముల్,08 మార్చి ( క్రాంతిన్యూస్ ): పెద్దేముల్ మండల కేంద్రంలో ప్రమాదవశాత్తు గడ్డివాములు కాలి బూడిదైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రైతు పిల్లి నర్సప్ప తన దొడ్డీ లో గడ్డివాములు ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో ప్రమాదవశాత్తు గడ్డీ వాముకి పెద్ద ఎత్తున నిప్పు అంటుకుంది. దీంతో అక్కడె ఉన్న వ్యవసాయ పనిముట్లు, గడ్డివాము అగ్నికి ఆహుతయ్యాయి వెంటనే గమనించిన స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వచ్చి మంటలు అదుపు చేసినట్లు స్థానికులు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 2లక్షలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు పిల్లి నర్సప్ప వెల్లడించారు.



# ఎస్ఆర్ఆర్ ఆధ్వర్యంలో క్రికెట్ కిట్ పంపిణి



రాయపర్తి,08 మార్చి (క్రాంతిన్యూస్ ): మండలంలోని కొండూరు లో మత్స్య పారిశ్రామిక సంఘం సభ్యుల వినతి మేరకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరిపాటి శ్రీనివాసరెడ్డి సహకారంతో ఫౌండేషన్ ప్రతినిధి లేతాకుల రంగారెడ్డి క్రికెట్ కిట్ అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, మాజీ జడ్పిటిసి రంగు కుమార్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, గజవెల్లి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# 'ఆమె శక్తి' విశ్వవ్యాప్తి

## స్త్రీ శక్తికి ,ప్రేమకు త్యాగానికి మారుపేరు

### - పెద్దేముల్ మండలంలో ఘనగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు



పెద్దేముల్,08 మార్చి ( క్రాంతిన్యూస్ ): పెద్దేముల్ మండలంలోని గాజీపూర్ పెద్దేముల్ మండల కేంద్రంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరుపుకున్నారు. శనివారం మహిళ దినోత్సవం సందర్భంగా మహిళ కాంగ్రెస్ ఆద్వర్యంలో, మరియు ఎల్ఎన్ఆర్ యువసేన ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. మహిళలతో కలిసి కేక్ కట్ చేసి అంగన్ వాడి టీచర్లకు , గ్రామ పంచాయితీ కార్మికులకు, ఆశవర్కర్లకు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకురాలు సుమిత్ర రాథోడ్ మాట్లాడుతూ స్త్రీ శక్తికి ,ప్రేమకు త్యాగానికి మారుపేరు అని అన్నారు, ఈ లోకంలో స్త్రీ లేకపోతే జననం లేదు. స్త్రీ లేకపోతే గమనం లేదు. స్త్రీ లేకపోతే సృష్టిలో జీవం లేదు. స్త్రీలేకపోతే అసలు సృష్టే లేదు. మరి.. మనల్ని కంటిపాపలా కాపాడే 'స్త్రీమూర్తి'ని స్మరించుకోవడం మన అందరి బాధ్యత. తల్లిగా లాలిస్తూ.. చెల్లిగా తోడుంటూ.. భార్యగా బాగోగులు చూస్తూ.. దాసిలా పనిచేస్తూ.. కుటుంబ భారాన్ని మోస్తూ... సర్వం త్యాగం చేస్తుంది మహిళ. అంతటి గొప్ప మహిళలకు ప్రతి ఒక్కరు గౌరవం ఇవ్వాలని అన్నారు. రాజకీయాల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు శోభారాణి, మండల మాజీ వైస్ ఎంపీపీ మధులత, మహిళా కాంగ్రెస్ నాయకులు సుమిత్ర రాథోడ్, డిఎల్డిఏ మాజీ చైర్మన్ గాజిపూర్ నారాయణ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు లోంక నర్సింలు, మండల మాజీ కో ఆప్షన్ సభ్యులు నసిర్, బుజ్జమ్మా, ఆంగన్ వాడి టీచర్ జహంగిర్ బేగం, నాయకులు రాము నాయక్, లాల్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి నిత్యవసర సరుకుల పంపిణి



**రాయపర్తి,08మార్చి(క్రాంతిన్యూస్ ):**

మండలంలోని బురహన్ పల్లి గ్రామానికి చెందిన ముత్తారపు రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ క్రమంలో శనివారం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు పరిపాటి శ్రీనివాస్ రెడ్డి 50 కోలోల బియ్యం, 5 లీటర్ల మంచి నూనె పంపించారు. ఫౌండేషన్ ప్రతినిధులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రంగు కుమార్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, నాయకులు ఎలామంచ శ్రీనివాస్ రెడ్డి, ఫౌండేషన్ ప్రతినిధి లేతాకుల రంగారెడ్డి, స్థానిక నాయకులు గొల్లపల్లి రమేష్, ముంజాల రవీందర్ గౌడ్, కిషన్, బాపు రెడ్డి, గినె శ్రీనివాస్, జంగిలి నరేష్, బాలే కుమార్, దొమ్మటి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అన్నిరంగాలలో పురుషులతో సమానంగా రాణిస్తున్నారు

## సెయింట్ మేరీ స్కూల్ ప్రిన్సిపాల్ శిబూపాల్



రాయపర్తి, 08 మార్చి (క్రాంతిన్యూస్ ): పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని సెయింట్ మేరీ పాఠశాల ప్రిన్సిపాల్ శిభూపాల్ అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని కాట్రపల్లి గ్రామం సెయింట్ మేరీ స్కూల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం పాఠశాల డైరెక్టర్లు వేముల రమేష్ కుందూరు వెంకట్ రెడ్డి ప్రధానోపాధ్యాయులు సోమన్న ఆధ్వర్యంలో మైనా టీచర్లకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ పెంతల రవీణ, ఉపాధ్యాయినీలు టి సుజాత బి శైలజ జి సుమలత కే రాణి పీ సరస్వతి పీ టి శైలజ ఆయాలు రేణుక కవిత లకు శుభాకాంక్షలు తెలిపి గెలుపొందిన వారికి బహుమతులను ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సునీల్ ఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు

# నన్ను చంపాలని చూస్తున్నారు

**బోరుగడ్డ అనిల్ సెల్ఫీ వీడియో రిలీజ్..**

**లోకేష్, పవన్ నుంచి ప్రాణహాని, ఎక్కడికీ పారిపోలేదంటూ..**



అమరావతి ,08 మార్చి ( క్రాంతిన్యూస్ ): తల్లికి అనారోగ్యం ఉందంటూ హైకోర్టులో బెయిల్ తీసుకుని, ఆ తర్వాత దాని పొడిగింపు కోసం ఫేక్ మెడికల్ సర్టిఫికెట్ సమర్పించి బెయిల్ తీసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ సానుభూతి పరుడు బోరుగడ్డ అనిల్ కుమార్ ఇవాళ ఓ సెల్ఫీ వీడియో విడుదల చేశారు. తాను ఎక్కడికీ పారిపోలేదని పేర్కొంటూ అసలు విషయం వెల్లడించారు. దీంతో బోరుగడ్డ వ్యవహారంలో ఏం జరుగుతుందో క్లారిటీ వచ్చినట్లయింది. పెళ్లికి ముందే ప్రెగ్నెంట్ నాలుగు నెలలుగా కూటమి ప్రభుత్వం తనపై కక్షసాధిస్తోందని బోరుగడ్డ అనిల్ తెలిపారు. ఫిబ్రవరి 14న మధ్యంతర బెయిల్ పై తాను బయటికి వచ్చానని తెలిపారు. తనకు అనంతపురం కోర్టులో బెయిల్ వస్తుందని తెలిసి కూటమి ప్రభుత్వం కుట్ర పన్ని తాను అజ్ఞాతంలోకి వెళ్లినట్లు ప్రచారం చేస్తోందన్నారు. తన ఆరోగ్యం బాగోలేదని, అదే సమయంలో చెన్నై అపోలో ఆస్పత్రిలో తన తల్లికి సర్జరీ జరగడంతో హైకోర్టుకు సమాచారం ఇచ్చామన్నారు. ఫిబ్రవరి 28న తాను జైల్లో లొంగిపోయానని, మార్చి 3న తాను తిరిగి రిలీజ్ అయ్యానని బోరుగడ్డ తెలిపారు. ఐదుగురు చెల్లెళ్లు ఉన్న తాను తన తల్లిని చూసుకునేందుకు ప్రయత్నిస్తున్నానని వెల్లడించారు. తాను ఫేక్ సర్టిఫికెట్ పెట్టి హైకోర్టును మోసం చేసి పారిపోయినట్లు జరుగుతోంది దుష్ప్రచారం అన్నారు. తాను జైల్లో ఉంటే ఫేక్ సర్టిఫికెట్ ఎలా పెడతానన్నారు. కూటమి ప్రభుత్వంలో లోకేష్, పవన్ తనకు శాశ్వతంగా బెయిల్ రాకుండా ఉండేందుకే ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. తనకు ఏమైనా వీరిదే బాధ్యత అన్నారు. గతంలో జరిగిన పరిణామాలకూ, ఇప్పుడు జరుగుతున్న ప్రచారానికి స్పందించి వాస్తవాలు బయటపెట్టేందుకే ఈ వీడియో విడుదల చేస్తున్నట్లు బోరుగడ్డ అనిల్ తెలిపారు. తనను చూసిన తర్వాతే తన తల్లి కోలుకుంటోందన్నారు. కోర్టు కూడా దీన్ని పరిగణనలోకి తీసుకుని తనకు న్యాయం చేయాలని బోరుగడ్డ కోరారు. మానవతా దృక్పథంతో తన తల్లిని చూసుకునేందుకు తాను వెళ్తే కూటమి నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. పోలీసులు తనపై పెట్టిన సెక్షన్లు చెల్లవన్నారు. తాను ఎటువంటి తప్పూ చేయలేదన్నారు. ఇలాంటి పరిస్థితులు ఎవరికీ రాకూడదని కోరుకుంటున్నట్లు తెలిపారు. తమ కుటుంబాన్ని చంపాలని చంద్రబాబు, పవన్, లోకేష్ ప్రయత్నిస్తున్నారన్నారు. తమకు ఏమైనా వీళ్లదే బాధ్యత అన్నారు. అవసరమైతే ప్రాణం వదిలేస్తా కానీ కోర్టు ధిక్కారణ మాత్రం చేయనన్నారు. కాబట్టి కోర్టు పరిశీలించి, తప్పుడు ఆరోపణలు కొట్టేసి తన తల్లిని చూసుకునే అవకాశం కల్పించాలన్నారు.



## ఏపీలో మరో కొత్త జిల్లా ఏర్పాటు..

**చంద్రబాబు కీలక వ్యాఖ్యలు..**



అమరావతి,08 మార్చి (క్రాంతిన్యూస్ ): ఏపీలో కొత్త జిల్లాల ఏర్పాటు ప్రస్తావన మరోసారి తెరపైకి వచ్చింది. సీఎం నారా చంద్రబాబు నాయుడు కొత్త జిల్లా ఏర్పాటుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రకాశం జిల్లా మార్కాపురంలో చంద్రబాబు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడిన చంద్రబాబు.. మార్కాపురాన్ని ప్రత్యేక జిల్లా చేస్తామని స్పష్టం చేశారు. పర్యటనలో భాగంగా మహిళలు, యువతులతో చంద్రబాబు ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఓ యువతి.. మార్కాపురం చుట్టూ 250కి పైగా గ్రామాలు ఉన్నాయని, ఇదే పెద్ద పట్టణమని ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో స్పందించిన చంద్రబాబు.. మార్కాపురాన్ని జిల్లా చేస్తానని ఎన్నికల సమయంలోనే చెప్పినట్లు గుర్తు చేశారు. హామీ ఇచ్చిన విధంగానే మార్కాపురాన్ని జిల్లా కేంద్రం చేస్తామని తెలిపారు. అన్ని రకాలుగా మార్కాపురాన్ని అభివృద్ధి చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు.

మరోవైపు మార్కాపురం పశ్చిమ ప్రాంతంలోని ఐదు నియోజకవర్గాలతో పాటు కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలను కలిపి ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు ఇటీవలే జిల్లా మంత్రులు వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. మంత్రులు డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్ ఇటీవలే దీనిపై వ్యాఖ్యలు చేశారు. తాజాగా సీఎం చంద్రబాబు నాయుడు నోటి నుంచి ఈ ప్రకటన రావటంతో మార్కాపురం జిల్లా ఏర్పాటయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలుస్తోంది.

అయితే ఇటీవల శాసనమండలిలో ఏపీ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ జిల్లాల పునర్వవస్థీకరణపై కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం వద్ద జిల్లాల పునర్వవస్థీకరణపైనా, కొత్త జిల్లాల ఏర్పాటుపైనా ఎలాంటి ప్రతిపాదనలు లేవని అనగాని సత్యప్రసాద్ క్లారిటీ ఇచ్చారు. ఇదే సమయంలో వైసీపీ ప్రభుత్వం చేపట్టిన జిల్లాల పునర్వవస్థీకరణపై విమర్శలు చేశారు. వైసీపీ హయాంలో మంత్రివర్గ సమావేశంలో కూడా చర్చించకుండా జిల్లాలు ఏర్పాటు చేశారని ఆరోపించారు. వైఎస్ జగన్ తొందరపాటుతో, అశాస్త్రీయంగా జిల్లాల విభజన చేశారని మంత్రి ఆరోపించారు. ప్రజా ప్రతినిధులతో చర్చించకుండా నిర్ణయం తీసుకున్నారని.. ఫలితంగా గందరగోళం ఏర్పడిందని మంత్రి ఆరోపించారు.

## వారికి ఒక్కొక్కరికి రూ.50 వేలు..

**శాశ్వతంగా పథకం అమలు..**

**విజయనగరం ఎంపీ కీలక నిర్ణయం..**



అమరావతి,08 మార్చి ( క్రాంతిన్యూస్ ): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విజయనగరం లోక్‌సభ నియోజకవర్గ ప్రజలకు స్థానిక ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు ఓ శుభవార్త వినిపించారు. విజయనగరంలోని రాజీవ్ స్పోర్ట్స్ మైదానంలో ప్రభుత్వం మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించింది. ఈ వేడుకలకు జిల్లా ఇంచార్జ్ మంత్రి, హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, స్థానిక ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఏపీ తూర్పు కాపు చైర్మన్ పాలవలస యశస్వి సహా పలువురు ముఖ్య నేతలు, అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడిన ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు.. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలు, బాలికలు సంరక్షణ కోసం కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వరుసగా మూడో ఆడబిడ్డకు జన్మనిస్తే.. ఆ ఆడ పిల్ల పేరు మీద 50 వేల రూపాయలు బ్యాంక్ ఖాతాలో జమ చేస్తానని ప్రకటించారు, వరుసగా మూడోసారి మగబిడ్డ పుడితే ఒక ఆవు, దూడను అందిస్తానని ప్రకటించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటన స్ఫూర్తితో విజయనగరం పార్లమెంట్ పరిధిలో.. ఈ కార్యక్రమాన్ని శాశ్వతంగా అమలుచేయనున్నట్లు ఎంపీ కలిశెట్టి ప్రకటించారు.

మరోవైపు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలే ముఖ్యమని భావనకు వస్తున్నారని అన్నారు. ఇందుకు ఎన్టీఆర్ చొరవే కారణమని కొనియాడారు. ఆయన చొరవతోనే వంటింటి నుంచి అసెంబ్లీలో అధ్యక్షా అనే స్థాయికి మహిళలు ఎదిగారని వంగలపూడి అనిత అభిప్రాయపడ్డారు. చంద్రబాబు నిర్ణయాల కారణంగా డ్వాక్రా సంఘాలు ద్వారా మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారని అన్నారు. మరోవైపు మహిళల భద్రత విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. మహిళలు, బాలికల సంరక్షణ కోసం అనేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అలాగే ఆడ పిల్లలను పెంచిన విధంగానే మగ పిల్లలను కూడా జాగ్రత్తగా, క్రమశిక్షణతో పెంచాలని హోం మంత్రి సూచించారు.

మరోవైపు మహిళల భద్రత కోసం ఏపీ ప్రభుత్వం శక్తి యాప్ తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. ప్రకాశం జిల్లా మార్కాపురంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఈ యాప్‌ను అధికారులు ప్రారంభించారు. మహిళలు, బాలికలు ఆపదలో చిక్కుకున్న సమయంలో సమాచారం ఇస్తే పోలీసులు సత్వరమే స్పందించేలా ఈ యాప్ రూపొందించారు.



# పోసానికి మరో షాక్..

**రిమాండ్ విధించిన కోర్టు..**



అమరావతి,08 మార్చి ( క్రాంతిన్యూస్ ): సినీ నటుడు పోసాని కృష్ణమురళికి మరో షాక్ తగిలింది. పోసాని కృష్ణ మురళికి విజయవాడ కోర్టు మార్చి 20 వరకు రిమాండ్ విధించింది. పీటీ వారెంట్ మీద విజయవాడలోని భవానీపురం పోలీసులు పోసాని కృష్ణ మురళిని.. శనివారం కర్నూలు జిల్లా జైలు నుంచి విజయవాడకు తీసుకువచ్చారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షలు పూర్తైన తర్వాత విజయవాడ చీఫ్ మెట్రోపాలిటిన్ మెజిస్ట్రేట్ కోర్టులో పోసాని కృష్ణ మురళిని హాజరుపరచగా.. కోర్టు మార్చి 20 వరకూ రిమాండ్ విధించింది. దీంతో పోసానిని విజయవాడ జైలుకు తరలించనున్నారు.

మరోవైపు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఇతర మంత్రులు, వారి కుటుంబసభ్యులపై దూషణలు, అసభ్యకర పోస్టులు పెట్టారనే ఆరోపణలపై జనసేన నేత శంకర్.. పోసాని కృష్ణ మురళిపైవిజయవాడ భవానీపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో భవానీపురం పోలీసులు పోసానిపై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలోనే పీటీ వారెంట్ జారీ చేశారు. అనంతరం కర్నూలు జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న పోసాని కృష్ణ మురళిని.. విజయవాడ కోర్టు ఎదుట హాజరుపరచగా.. కోర్టు రిమాండ్ విధించింది.

మరోవైపు తనపై అక్రమ కేసులు పెట్టారంటూ విజయవాడ సీఎంఎం కోర్టులో పోసాని కృష్ణ మురళి వాపోయారు. ఒకే రకమైన కేసులతో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు తిప్పుతున్నారని న్యాయాధికారికి తెలియజేశారు. తాను అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నానని.. గుండె జబ్బు, పక్షవాతం లాంటి సమస్యలు ఉన్నాయని పోసాని కృష్ణ మురళి కోర్టుకు తెలియజేశారు. అనంతరం కోర్టు మార్చి 20వ తేదీ వరకూ రిమాండ్ విధించింది.

మరోవైపు పోసాని కృష్ణ మురళికి ఏపీ హైకోర్టులో స్వల్ప ఊరట లభించింది. తనపై నాలుగు పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులను కొట్టివేయాలంటూ పోసాని కృష్ణమురళి ఏపీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు.. విశాఖపట్నం, చిత్తూరు జిల్లాల్లో నమోదైన కేసులలో తొందరపాటు చర్యలు వద్దని పోలీసులను ఆదేశించింది.



# నారా భువనేశ్వరికి చీర కొన్న చంద్రబాబు..

**బేరమాడి మరీ.. ఎంతో తెలుసా?**



అమరావతి,08 మార్చి ( క్రాంతిన్యూస్ ): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సతీమణి నారా భువనేశ్వరి కోసం చీర కొనుగోలు చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు ప్రకాశం జిల్లా మార్కాపురంలో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. మార్కాపురంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల మహిళలు ఏర్పాటు చేసిన స్టాళ్లను చంద్రబాబు పరిశీలించారు. ఈ క్రమంలోనే ఓ స్టాల్ వద్దకు వెళ్లిన చంద్రబాబు.. స్టాల్‌లోని చీరలను పరిశీలించారు. అనంతరం సతీమణి భువనేశ్వరికి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బహుమతిగా ఇవ్వడానికి ఓ చీరను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా స్టాల్‌లోని మహిళ.. చంద్రబాబు మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది.

చీరలు ఉన్న ఓ స్టాల్ వద్దకు వెళ్లిన చంద్రబాబు. .అక్కడ ఉన్న పలు చీరలను పరిశీలించారు. స్టాల్ లోని మహిళ సీఎం చంద్రబాబుకు ఉప్పాడ పట్టు, పొందూరు, మంగళగిరి పట్టు చీరలను చూపించారు. అలాగే ఆ చీరల విశేషాన్ని వివరించారు. అక్కడ ఉన్న చీరలలో నుంచి సతీమణి నారా భువనేశ్వరి కోసం చంద్రబాబు ఓ చీరను ఎంపిక చేశారు. దాని రేటు ఎంత అంటూ స్టాల్‌లోని మహిళను అడిగారు. ఆమె రూ. 26,400 అంటూ సమాధానం ఇవ్వగా.. చంద్రబాబు ఒకింత ఆశ్చర్యపడ్డారు. పక్కనే ఉన్న సిబ్బందికి రూ.25000 ఇవ్వాలంటూ చెప్పి.. ఆ మహిళ వ్యాపారం చేస్తున్న తీరును చంద్రబాబు అభినందించారు. వ్యాపారం బాగా చేస్తున్నావంటూ ప్రోత్సహించారు.

మరోవైపు మహిళా దినోత్సవం సందర్భంగా మార్కాపురం వేదికగా మహిళల కోసం వివిధ కార్యక్రమాలను చంద్రబాబు ప్రారంభించారు. స్వయం సహాయక బృందాలకు సెర్ప్ ద్వారా రూ.1826.43 కోట్ల బ్యాంకు లింకేజి రుణాలు పంపిణీ చేశారు. అలాగే స్త్రీనిధి ద్వారా లక్ష మంది మహిళలకు తక్కువ వడ్డీకి రూ.1,000 కోట్ల రుణాల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. అలాగే చేనేత మహిళలకు ఉచితంగా నూలు పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. అలాగే 1.50 లక్షల మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ మహిళలకు ఉపాధి అవకాశాలు, శిక్షణ ఇచ్చేలా హోం ట్రైయాంగిల్, ఆశా ఫౌండేషన్, ర్యాపిడో, ఫ్లిప్ కార్ట్, నేచర్ అరకు కాఫీ సహా వివిధ సంస్థలతో ఒప్పందం చేసుకున్నారు. ఆయా కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు.

# అగుపించే బరువుల వెనుక

# కనిపించని ఆకలి ఎంతో!

అవమానాలు లెక్క తీసుకుంటే పొద్దస్తమానం పస్తులు మిగిలేను. ఆసరాగాలేని అభాగ్యులు, ఆదుకునే నాధుడు



కవి. నీరటి. సింహయ్య

కరువైన నిర్భాగ్యులు, తాగుడు చెదిమేసిన దేహాలతో, అనుమానం భూతమైన జీవితాలతో, ఆకాశమంత సహనానికి నిలువెత్తు రూపాలుగా, నిలిచి సంతానం కోసం తపించి సమాజాన్ని మెప్పించి తలదించుకునే పనుల జోలికి వెళ్లకుండా, తలుపులేవి మదిలోకి తర్లాడకుండా, ఆలోచనలు నిలిపివేసి, శిరస్సును సూర్యుడికి ఎదురు నిలిపి చెమట చుక్కల సారాన్ని చిందించిన జీవిత సమర విజేతవు నీవు.ఆయుదం అయ్యావు. సాయుధ సారమయ్యావు. చేతిలో కలమయ్యావు.

చెండాలులకు కరవాలమయ్యావు. పండు వయ్యావు. పవిత్ర జీవముతో పావన

మయ్యావు. మదగజాలననిచివేయ మరపిరంగివయ్యావు. సంతానాన్ని శివాజీలుగా మార్చే శివంగివయ్యావు. నీకు ప్రత్యేక దినమేంది! అన్ని దినములు నీవే. తలవంచి నమస్కరించే తల్లివయ్యావుగా. జగతికి జననివయ్యావుగా. సదా నీకెప్పుడు ప్రణామములు కదా!

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



ఇనుగుర్తి, 08 మార్చి (క్రాంతిన్యూస్ ): ఇనుగుర్తి మండల కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో రైతు వేదికలో మహిళా గ్రామసభ ను శనివారం నిర్వహించారు. ఇందులో వాష్ (మంచినీరు వృధా కాకుండా చేయడం, హానికర చెత్తను బయటవేయవద్దు, చేతులు శుభ్రంగా కడుక్కొని ఆహారం తీసుకోవడం) గురించి మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో గురుకుల బాలికల పాఠశాల/ కళాశాల ప్రిన్సిపల్ జయశ్రీ,ఎస్ హెచ్ జి డ్వాక్రా గ్రూప్ మహిళ గుజ్జునూరి సరిత, గ్రామపంచాయతీ ఎంపీడబ్ల్యూ యాకమ్మ, ఆశావర్కర్స్ శ్రీలత, నీలమ్మ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇనుగుర్తి గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్, గ్రామపంచాయతీ బిల్ కలెక్టర్ మధుసూదన్, ఐకెపి వివో ఏ సులోచన, మంజుల, జయలక్ష్మి, పావని, డ్వాక్రా గ్రూప్ మహిళలు పాల్గొన్నారు.

## ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ లో మహిళా సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపిన సీఐ ప్రవీణ్ కుమార్




ధర్మసాగర్, 08 మార్చి( క్రాంతిన్యూస్ ): హనుమకొండ జిల్లా ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మహిళా దినోత్సవం సందర్భంగా సి ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐలు నర్సింగరావు, జాన్ పాషా, స్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో, పోలీస్ స్టేషన్లో విధినిర్వహణలో ఉన్న మహిళా సిబ్బందిని గౌరవప్రదంగా శాలువాతో సత్కరించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళల పట్ల తమకున్న గౌరవాన్ని చాటుకున్నారు. మహిళలు ఆత్మగౌరవంతో హక్కుల కోసం పోరాడుతూ ముందుకు సాగాలని, మహిళల సాధికారతతోనే ఆర్థిక బలోపేతం అవుతుందని సూచించారు. మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని అన్నారు.




## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు





వరంగల్, 08 మార్చి(క్రాంతిన్యూస్ ): వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ జక్కలొద్ది శివారులో గల రామ సురేందర్ నగర్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం మైదం వినోద తూర్పటి కవిత ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ముఖ్య అతిధిగా సుద్దాల నాగరాజు పాల్గొని మాట్లాడుతూ మహిళలుఅన్నిరంగాల్లో రాణించాలని,ఎన్నో పోరాటాల ఫలితంగా నేడు మనం మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని అన్నారు. విద్యా, వైద్యరంగాల్లో మహిళలు ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. రాజకీయాలకు అతీతంగా విద్యారంగం బలోపేతం కావాలని ఆయన పిలుపునిచ్చారు. రాణిరుద్రమ ఏలిన మన జిల్లాలో వారి పోరాట పటిమను ప్రతిబింబించేలా ఆడపిల్లలు చదువుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో దుప్పటి రమ్య, సట్ల రజిత, పల్లపు కోమలు స్థానికులు పాల్గొన్నారు

## ఆంజనేయ స్వామి విగ్రహ పునః ప్రతిష్టాపన పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే యం. పద్మదేవేందర్ రెడ్డి



మెదక్, 08 మార్చి (క్రాంతిన్యూస్ ): మెదక్ మండలంలోని పేరూరు గ్రామంలో ఆంజనేయ స్వామి విగ్రహ పునః ప్రతిష్ట నిర్వహించారు. ఈ మహోత్సవంలో మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే యం. పద్మదేవేందర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ

ఆంజనేయ స్వామి అనుగ్రహంతో గ్రామం పచ్చగా ఉండాలని ప్రతి కుటుంబం చల్లగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా మాజీ ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ జెడ్పి ఉపాధ్యక్షురాలు యం. లావణ్య రెడ్డి, మెదక్, మాచవరం పిఎసిఎస్ చైర్మన్ లు హనుమంత్ రెడ్డి, సీతారామయ్య నాయకులు జయరాం రెడ్డి, కిష్టయ్య, ప్రభాకర్, రామచంద్ర రెడ్డి, ఏగొండ, రాములు, మల్లేశం, శ్రీధర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, సంజీవరెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

» చౌరస్తా నుండి హైస్కూల్ వరకు ర్యాలీ మహిళలు » మహిళలు అన్ని రంగాలలో ముందుకు సాగాలి » బాలవికాస జిల్లా కోఆర్డినేటర్ జ్యోతి



నరసింహులపేట, 08 మార్చి (క్రాంతిన్యూస్ ): బాలవికాస ఆధ్వర్యంలో శనివారం. వేంకటేశ్వరస్వామి టెంపుల్ వద్ద కల్యాణ మండపంలో జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా

స్థానిక ఎంపీడీవోకిన్నెర యాకయ్య. స్థానిక ఎస్సై మాలోత్ సురేష్ హాజరై వారు

మాట్లాడుతూ మహిళా దినోత్సవం గురించి ప్రాముఖ్యత ను తెలియాపరచారు. నేటి సమాజంలో స్త్రీ ఒక అత్యంత శక్తి గా ఎదిగింది అని మరియు ఇంకా స్త్రీలు అన్ని రంగాలలో రాణిస్తున్నారు అయినా ఎక్కడో ఒక చోట వివక్షత కు గురి అవుతున్నారు. అని ఆవేదన వ్యక్త పరచారు అనంతరం మహిళల దినోత్సవం సందర్భంగా ఎస్సై సురేష్ మహిళలకు సుమారు 20 మంది మహిళలకు శాలువాలతో సత్కరించారు...

అనంతరం బాలవికాస జిల్లా కోఆర్డినేటర్. జ్యోతి. మాట్లాడుతూ....

మహిళలు సాధించిన ప్రతిదానిని జరుపుకునేందుకు మరియు సమానత్వం కోసం పిలుపునివ్వడానికి ఈ దినోత్సవాన్ని ఉపయోగిస్తారు. ప్రపంచ సమస్యలపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలను ఏకతాటిపైకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్న ఐక్యరాజ్యసమితి (యూఎన్) ఈ సంవత్సరం థీమ్ "అన్ని మహిళలు మరియు బాలికల కోసం: హక్కులు. సమానత్వం. సాధికారత" అని పేర్కొంది అని తెలియ పరచారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మండలాలబాల వికాస కోఆర్డినేటర్ సుకన్య. బాలవికాస కోఆర్డినేటర్లు. శోభ, సరూప. స్వర్ణలత. యాక లక్ష్మి.. దంతాలపల్లి నరసింహుల పేట మహిళలు భారీ ఎత్తున పాల్గొన్నారు మహిళలు సిహెచ్.మంజుల. మాజీ సర్పంచ్ వేముల రజిత. గౌని లక్ష్మి. చౌడవరపు నాగలక్ష్మి. సిహెచ్ సౌజన్య. రజిత. అరుణ. చాంద్ బి. తో పాటు మహిళలు తో పాటు తదితరులు పాల్గొన్నారు




## మహిళా దినోత్సవం సందర్భంగా..


### పారిశుద్ధ్య మహిళా కార్మికులకు ఘన సన్మానం



నర్సింహులపేట, 08 మార్చి (క్రాంతిన్యూస్ ): గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య మహిళా కార్మికులకు బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ బి ఆర్ఎస్ అధ్యక్షులు కొండపత్తిని జగదీశ్వర్ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి స్వీట్లు పంచారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల యూత్ మాజీ అధ్యక్షుడు బండి రమేష్ మాట్లాడుతూ సమాజ ఎదుగుదలకు మహిళ మనలే మూలమణి ఇంటి శుభ్రతకు ఇల్లాలు చొరవ ఎంత ముఖ్యమో గ్రామాల శుభ్రతకు మహిళా కార్మికుల చొరవ అంతే ముఖ్యం అని వారి సేవలు ఎనలేవి అని మహిళల పట్ల ఇంట్లో అయిన సమాజం లో అయిన గౌరవప్రదంగా నడుచుకున్న వ్యక్తులు ఉన్నతంగా ఉంటారని కొని ఆడారు. అనంతరం మహిళలందరికీ కృతజ్ఞతలు తెలిపారు మహిళ పరిశుద్ధ కార్మికులకు సన్మానం చేయడం ఆనందదాయకం అన్నారు . ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఉప సర్పంచ్ కర్ల నాగన్న,మాజీ వార్డు సభ్యుడు మదార్ పెండం గిరి రేఖ శ్రీను వీరన్న కారోబార్ రమేష్ జిపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## రాజ్యాలు సొంతగా ఎలెలా మహిళలు ఎదగాలి..

### డా.వివేక్ కిసాన్ పరివార్ C.E.O



తొర్రూరు,08 మార్చి (క్రాంతిన్యూస్ ): మున్సిపాలిటీ కేంద్రం లో శ్రీవాణి ఎడ్యుకేషన్ ,సోషల్ సర్వీస్ సొసైటీ ఫౌండర్ డాక్టర్ నాగవాణి, సిడబ్ల్యూసి చైర్ పర్సన్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకల సందర్భంగా ముఖ్యఅతిథిగా డాక్టర్ వివేక్ పాల్గొని మాట్లాడుతూ ఒకప్పుడు మహిళలకు వ్యవసాయం, పరిశ్రమలు మాత్రమే ఉపాధి మార్గాలు, కానీ ఇప్పుడు ఎన్నో రంగాల్లో మహిళలు రాణిస్తున్నారు.. అయినప్పటికీ మహిళల పట్ల సమాజంలో చిన్న చూపు పోవడం లేదు.ప్రతి రంగంలో మహిళల ప్రస్థానాన్ని, వారి స్థానాన్ని సమీక్షించాలి. లింగ సమానత్వం విషయంలో ఐక్యరాజ్యసమితి నిర్దేశించుకున్న లక్ష్యాలను ఎంత మేర మనం చేరుకోగలుగుతున్నామో ఆవలోకనం చేసుకోవాలి అని అన్నారు..

మహిళా తన కళ్ళ మీద తన నిలబడాలి, రాజకీయ రంగంతోపాటు అన్ని రంగాల్లో విమాత్మక శక్తిగా ఎదగాలి అని వారు అన్నారు... మహిళా దినోత్సవం సందర్భంగా బాలికా విద్యా ప్రాముఖ్యత అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన బాలికలకు బహుమతులు ప్రదానం చేసారు, క్రొత్తగా ఉపాధ్యాయ వృత్తి ని చేపట్టిన ఉపాధ్యాయిని లను ఈ సందర్భంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో పినాకపాణి, వాణి, శైలజ, విమల, చైతన్య, సభిత తదితరులు పాల్గొన్నారు.





## మహిళా ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం




తొర్రూరు, 08 మార్చి (క్రాంతిన్యూస్ ): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తొర్రూరు లోని ఆర్యభట్ట ఉన్నత పాఠశాలలో ఘనంగా మహిళ ఉపాధ్యాయ బృందాన్ని సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మధుకర్ రెడ్డి మాట్లాడుతూ స్త్రీలు సమాజంలో సగభాగం అనీ, వారు ఆధునిక యుగంలో అన్ని రకాల ఉద్యోగాలలో దూసుకుపోతున్నారని దానికి కారణం విద్య. మహిళలు విద్య ద్వారా, ఉద్యోగాల ద్వారా ఆర్థిక స్వలంబన సాధించి ఉన్నత స్థానంలో ఉన్నారని తెలిపారు. ఈ రోజు మహిళలు అన్ని రంగాలలో ముందున్నారని, ఆకాశమంత మనసే కాకుండా అంతరిక్షంలో, రక్షణ రంగంలో అన్నింటా అవకాశాలు అందిపుచ్చుకుని అందరికీ మార్గ దర్శకులుగా విజయ పథాన ముందుకు పోతున్నారని ఇది అత్యంత శుభప్రదమని తెలిపారు.ఈ కార్యక్రమములో కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ శశికళ, రామ్మూర్తి, సింహయ్య శ్రీనివాస్, పూర్ణచందర్, కుమార్, అశోక్, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలి – గురుకుల కళాశాల ప్రిన్సిపల్ జయశ్రీ




ఇనుగుర్తి, 08 మార్చి ( క్రాంతిన్యూస్ ): ఇనుగుర్తి మండల కేంద్రంలోని గురుకుల సాంఘిక సంక్షేమ పాఠశాల/కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థినులకు మహిళా సాధికారత దిశగా అడుగులు అను అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం మహిళా టీచర్స్ ను సన్మానించారు. ఈ సందర్భంగా గురుకుల కళాశాల ప్రిన్సిపల్ జయ శ్రీ మాట్లాడుతూ మహిళ సాధికారతతోనే సమాజాభివృద్ధి, దేశాభివృద్ధి జరుగుతుందని మహిళలు అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్స్ గిద్దె ప్రసాద్, సురేష్, ఉప్పలయ్య, రవీందర్, మల్లయ్య, లక్ష్మణ్, భూపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి హ్యూమన్ రైట్స్ చైర్మన్ కుమ్మరి రామ్మూర్తి

పెద్ద వంగర, 08 మార్చి (క్రాంతిన్యూస్ ): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వడ్డేకొత్తపల్లి గ్రామపంచాయతీ నందు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొన్న నేషనల్ హ్యూమన్ రైట్స్ పెద్దవంగర మండల చైర్మన్ కుమ్మరి రామ్మూర్తి మహిళలకు "అంతర్జాతీయ మహిళా దినోత్సవం" శుభాకాంక్షలు తెలిపి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ రామ్మూర్తి మాట్లాడుతూ సృష్టిలో నారీ శక్తి ఎంతో గొప్పదని, ఈ సృష్టికి మూలం స్త్రీ మాత్రమేనని, మహిళలు ప్రతి రంగంలో పురుషులతో పాటు ముందుండాలని, ప్రపంచాన్ని జయించే శక్తి మహిళలకు మాత్రమే ఉన్నదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముత్తినేని విజయమ్మ, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కేశబోయిన మాధవి, సిఏలు ఎర్రగొర్ల కామరతి, బంధు నిర్మల, అంగన్వాడి టీచర్లు శివారపు అరుణ, దంతాలపల్లి వెంకటలక్ష్మి, ఆశా వర్కర్లు ముత్తినేని రజిత, మున్నూరు హేమలత, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎర్రగొర్ల రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ హరీష్, కారోబార్ పరుశరాములు మహిళా సంఘాల అధ్యక్షులుతో పాటు వివిధ సంఘాల సభ్యులు, జిపి సిబ్బంది, మహిళామణులు తదితరులు పాల్గొన్నారు.



## పొటాషియం లోపం ఉంటె ఇలా అవుతుందా ..?




**రక్త సరఫరాకు..**

పొటాషియం మన శరీరంలో రక్త సరఫరాను నియంత్రిస్తుంది. పొటాషియం తగినంతగా లేకపోతే రక్త సరఫరాపై నియంత్రణ ఉండదు. దీంతో గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది.

హెల్త్ న్యూస్ ,08 మార్చి (క్రాంతిన్యూస్ ): మన శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే అనేక రకాల పోషకాలు అవసరం అవుతాయన్న సంగతి అందరికీ తెలిసిందే. కనుకనే రోజూ అన్ని పోషకాలు కలిగిన ఆహారాలను తీసుకోవాలని పోషకాహార నిపుణులు, వైద్య నిపుణులు చెబుతుంటారు. మన శరీరానికి కావల్సిన అన్ని పోషకాలు సక్రమంగా లభిస్తేనే మనం ఆరోగ్యంగా ఉంటాం. జీవక్రియలు సరిగ్గా నిర్వహించబడతాయి. రోగాలు రాకుండా ఉంటాయి. పోషకాల లోపం వస్తే మన శరీరం పలు లక్షణాలను తెలియజేస్తుంది. ఇక మన శరీరానికి అవసరం అయిన ముఖ్యమైన పోషకాల్లో ఒకటైన పొటాషియం లోపిస్తే కూడా శరీరం పలు సంకేతాలను సూచిస్తుంది. దాన్ని బట్టి పొటాషియం లోపం వచ్చిందని అర్థం చేసుకోవచ్చు.

**ద్రవాలు సమతుల్యంలో..**

పొటాషియం మన శరీరంలో ద్రవాలను సమతుల్యంలో ఉంచుతుంది. శరీరంలో రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. ఇది లోపిస్తే ఆయా పనులకు ఆటంకం ఏర్పడుతుంది. పొటాషియం స్థాయిలు శరరీంలో తక్కువగా ఉంటే కండరాల్లో అసౌకర్యం ఏర్పడుతుంది. కండరాలు దృఢంగా, గట్టిగా మారుతాయి. ఆ ప్రాంతం మీద చేతితో టచ్ చేస్తే స్పర్శ లేనట్లు అనిపిస్తుంది. శరీరంలో పొటాషియం స్థాయిలు తగ్గితే తీవ్రమైన అలసట, నీరసం కనిపిస్తాయి. చిన్న పని చేసినా విపరీతమైన అలసట వస్తుంది. బలహీనంగా ఉన్నట్లు అనిపిస్తుంది. పొటాషియం లోపం ఉంటే కండరాలు బలహీనంగా మారుతాయి. రాత్రి పూట కాలి పిక్కలు పట్టుకుపోతుంటాయి. దీంతో నొప్పి విపరీతంగా ఉంటుంది. ఈ లక్షణం కనిపిస్తే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే డాక్టర్‌ను కలవాలి. అలాగే పొటాషియం తక్కువగా ఉంటే కొందరికి మలబద్దకం సమస్య కూడా వస్తుంది. జీర్ణక్రియ సాఫీగా జరగదు. తిన్న ఆహారం సులభంగా జీర్ణం కాదు. దీంతో అజీర్తి, గ్యాస్, కడుపు ఉబ్బరం ఏర్పడుతాయి. మలబద్దకంతో ఇబ్బందులు పడుతుంటారు. పొటాషియం లోపం వల్ల శరీరంలో కొన్ని భాగాలపై టచ్ చేస్తే కొందరికి స్పర్శ లేనట్లు అనిపిస్తుంది.

**షుగర్ లాంటి లక్షణాలు..**

షుగర్ బారిన పడిన వారికి తరచూ దాహంగా అనిపించడం, తరచూ మూత్ర విసర్జనకు వెళ్లడం వంటి సమస్యలు వస్తాయన్న సంగతి తెలిసిందే. అయితే పొటాషియం లోపం ఉన్నా కూడా ఇలాంటి లక్షణాలే కనిపిస్తాయి. కనుక దీన్ని షుగర్ కావచ్చని కొందరు అనుమానిస్తారు. అయితే షుగర్ టెస్ట్ చేయిస్తే అసలు విషయం తెలిసిపోతుంది. ఒక వేళ షుగర్ లేకున్నా ఈ లక్షణాలు కనిపిస్తుంటే దాన్ని పొటాషియం లోపంగా అనుమానించాలి. డాక్టర్‌ను కలిసి చికిత్స తీసుకోవాలి. పొటాషియం లోపం వల్ల శ్వాసకకోశ వ్యవస్థపై ప్రభావం పడుతుంది. దీంతో శ్వాస తీసుకోవడం కష్టంగా మారుతుంది. ఊపిరితిత్తులు ఇబ్బందులకు గురవుతాయి. అందుకనే శ్వాసకు సమస్యగా ఉంటుంది. ఇక పొటాషియం మనకు పలు ఆహారాల్లో లభిస్తుంది. అరటి పండ్లు, నారింజ, పాలకూర, చిలగడదుంపలు, అవకాడో, బీన్స్, పెరుగు, చేపలు, ఆలుగడ్డలు, టమాటాలు వంటి ఆహారాలను తింటుంటే పొటాషియం లోపం నుంచి బయట పడవచ్చు.

## జ్వరం వచ్చిందా.. అయితే ఈ ఆహారాలను ఎట్టి పరిస్థితిలోనూ తినకండి..!

హెల్త్ న్యూస్ ,08 మార్చి (క్రాంతిన్యూస్ ): జ్వరం వచ్చిందంటే చాలు.. చాలా మంది ఆహారాన్ని అసలు తీసుకోరు. ఇక కొందరు అయితే తమకు నచ్చిన ఆహారాలను తింటుంటారు. డైట్‌ను పాటించరు. దీంతో జ్వరం తీవ్రత ఎక్కువవుతుంది. ఆపైన ఇబ్బందులు పడతారు. అయితే జ్వరం వచ్చిన వారు ఆహారం విషయంలో కచ్చితంగా నియమాలను పాటించాలి. ముఖ్యంగా కొన్ని రకాల ఆహారాలను తినకూడదు, కేవలం కొన్ని ఆహారాలనే తినాలి. డైట్ పాటించకపోతే జ్వరం తీవ్రత పెరిగి ప్రమాదకరమైన పరిస్థితులు వచ్చే అవకాశాలు ఉంటాయి. ఇక జ్వరం వచ్చిన వారు ఎట్టి పరిస్థితిలోనూ పాఉ, చీజ్, పెరుగు వంటి పాల ఉత్పత్తులను తీసుకోకూడదు. ఇవి మ్యూకస్ ఉత్పత్తిని పెంచుతాయి. దీంతో శ్వాసకోశ వ్యవస్థపై ఒత్తిడి పడుతుంది. కనుక జ్వరం వచ్చిన వారు పాలు లేదా పాల ఉత్పత్తులకు దూరంగా ఉంటే మంచిది.




**తీపి పదార్థాలు :** జ్వరం వచ్చినవారు ఎట్టి పరిస్థితిలోనూ తీపి పదార్థాను తినకూడదు. ముఖ్యంగా చక్కెర అధికంగా ఉండే ఆహారాలను తినకూడదు. తింటే శరీర రోగ నిరోధక వ్యవస్థ బలహీనంగా మారుతుంది. రోగ నిరోధక శక్తి తగ్గుతుంది. దీంతో శరీరం వాపులకు గురవుతుంది. ఫలితంగా ఇన్‌ఫెక్షన్ మరింత పెరిగే ప్రమాదం ఉంటుంది. దీంతో జ్వరం తీవ్రత కూడా పెరుగుతుంది. కాబట్టి జ్వరం ఉంటే తీపి పదార్థాల జోలికి వెళ్లకండి. కొందరు జ్వరం ఉన్నా కూడా లెక్క చేయకుండా మాంసాహారం తింటారు. కానీ అలా చేస్తే కొవ్వులు శరీరంలో అధికంగా చేరి జీర్ణవ్యవస్థపై భారం పడుతుంది. ఆహారాన్ని శరీరం సరిగ్గా జీర్ణం చేయలేదు. దీంతో అజీర్తి, గ్యాస్, విరేచనాలు వంటి సమస్యలు ఏర్పడే అవకాశాలు ఉంటాయి. కనుక జ్వరం వచ్చినప్పుడు మాంసాహారానికి కూడా దూరంగా ఉండండి.

**ఫైబర్ ఆహారాలు :** ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలను తింటే మనకు ఎంతగానో మేలు జరుగుతుంది. అయితే జ్వరం వచ్చినప్పుడు మాత్రం ఇలాంటి ఆహారాలను తినకూడదు. తేలిగ్గా జీర్ణం అయ్యే ఆహారాలనే తినాలి. ఫైబర్ ఉండే తృణ ధాన్యాలు, బీన్స్, ఆకుకూరలు, కూరగాయలను తింటే అవి జీర్ణం అయ్యేందుకు సమయం పడుతుంది. జీర్ణ వ్యవస్థపై భారం పడుతుంది. దీంతో సమస్య మరింత ఎక్కువవుతుంది. కనుక జ్వరం వచ్చిన వారు ఈ ఆహారాలకు కూడా దూరంగా ఉండాల్సిందే. జ్వరం వచ్చిన వారు నిమ్మజాతికి చెందిన పండ్లను తినకూడదు. వీటిల్లో విటమిన్ సితోపాటు ఆమ్లాలు అధికంగా ఉంటాయి. జ్వరం వచ్చిన వారు తింటే గొంతులో, పొట్టలో అసౌకర్యం ఏర్పడే అవకాశాలు ఉంటాయి. దీంతో గ్యాస్, కడుపు ఉబ్బరం వస్తాయి. కాబట్టి జ్వరం వస్తే సిట్రస్ పండ్లను కూడా తినకూడదు.

**టీ, కాఫీ :** జ్వరం వచ్చిన వారు కొందరు టీ, కాఫీలను ఎడా పెడా తాగుతుంటారు. కానీ ఇలా చేస్తే వాటిల్లో ఉండే కెఫీన్ నిద్రకు భంగం కలిగిస్తుంది. దీని వల్ల జ్వరం నుంచి త్వరగా కోలుకోలేరు. కనుక జ్వరం ఉన్నవారు టీ, కాఫీలను మరీ ఎక్కువగా సేవించకూడదు. ఒక మోస్తరుగా తీసుకోవచ్చు. జ్వరం వచ్చినవారు ఎట్టి పరిస్థితిలోనూ మద్యం సేవించకూడదు. మద్యం సేవిస్తే సహజంగానే శరీరం డీహైడ్రేషన్ బారిన పడుతుంది. శరీరంలోని ద్రవాలు వేగంగా బయటకు పోతాయి. దీనికి తోడు శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఇవి జ్వరం ఉన్నవారికి మంచివి కావు. జ్వరం సమస్యను మరింత ఎక్కువ చేస్తాయి. కనుక జ్వరం ఉంటే మద్యం జోలికి వెళ్లకూడదు. అలాగే వేయించిన ఆహారాలు, నూనె పదార్థాలు, ప్రాసెస్ చేయబడిన ఆహారాలు వంటి వాటిని కూడా జ్వరం వచ్చిన వారు తినకూడదు. ఇవి జీర్ణ వ్యవస్థపై భారం వేస్తాయి. కాబట్టి వీటికి దూరంగా ఉండాలి.

## లివర్ ఆరోగ్యంగా ఉండాలా అయితే వీటిని తీసుకోవాల్సిందే..


హెల్త్ న్యూస్ ,08 మార్చి (క్రాంతిన్యూస్ ): లివర్ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తినడం చాలా ముఖ్యం. ఫైబర్ లివర్ పనితీరును మెరుగుపరచడంలో సహాయపడుతుంది. యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ నుండి లివర్ కణాలను కాపాడుతాయి. అదనంగా ఆరోగ్యకరమైన కొవ్వులు లివర్‌పై ఒత్తిడి తగ్గించడానికి ఉపయోగపడతాయి. ఆయుర్వేదం ప్రకారం కొన్ని మసాలా దినుసులు కూడా లివర్ ఆరోగ్యానికి చాలా ఉపయోగంగా ఉంటాయి. ఫ్యాటీ లివర్ వంటి సమస్యలను తగ్గించడంలో కొన్ని మసాలా దినుసులు సహాయపడతాయి. కింది ఐదు మసాలా



దినుసులు లివర్ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ముఖ్యమైనవి. అల్లం వాడటం వలన లివర్‌లో వాపు తగ్గుతుంది. ఇది లివర్ కణాలను దెబ్బతినకుండా కాపాడుతుంది. నిర్విషీకరణకు సహాయపడుతుంది. తులసి యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు కలిగి ఉంటుంది. ఇది లివర్‌ను వైరస్‌ల నుండి కాపాడుతుంది. తులసి వాడటం లివర్ పనితీరును మెరుగుపరచడంలో ఉపయోగంగా ఉంటుంది.

దాల్చిన చెక్కలో ఉండే సిన్నమిక్ యాసిడ్ అనే పాలీఫెనాల్ లివర్ లో ట్రైగ్లిజరైడ్ పేరుకుపోయే సమస్యను తగ్గిస్తుంది. ఇది ఫ్యాటీ లివర్ సమస్యను తగ్గించడంలో సహాయపడుతుంది.

వెల్లుల్లి వాడటం వలన లివర్ లో పేరుకునే కొవ్వు తగ్గుతుంది. ఇది లివర్ ఎంజైమ్ల పనితీరును మెరుగుపరచి, నిర్విషీకరణను సులభతరం చేస్తుంది.పసుపులో ఉండే కర్కుమిన్ యాంటీఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు కలిగి ఉంటాయి. పసుపు లివర్ రక్షణకు, లివర్ ఆరోగ్యానికి సహాయపడుతుంది.



# ఛాంపియన్స్ ట్రోఫీ విజేతకు ప్రైజ్‌మనీ ఎంతో తెలుసా..?



స్పోర్ట్స్ న్యూస్ ,08 మార్చి (క్రాంతిన్యూస్ ): ఛాంపియన్స్ ట్రోఫీ-2025 తుది అంకానికి చేరింది. దుబాయ్ వేదికగా రేపు (మార్చి 9) జరుగబోయే ఫైనల్లో భారత్, న్యూజిలాండ్ అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఈ మ్యాచ్ భారతకాలమానం ప్రకారం మధ్యాహ్నం 2:30 గంటలకు ప్రారంభమవుతుంది. క్రికెట్ అభిమానులు ఈ మ్యాచ్ కోసం కళ్లకు వత్తులు పెట్టుకుని ఎదురుచూస్తున్నారు.

విజేతకు భారీ ప్రైజ్‌మనీ

ఈసారి ఛాంపియన్స్ ట్రోఫీ విజేతగా నిలిచే జట్టు భారీ మొత్తంలో ప్రైజ్‌మనీ లభించనుంది. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ప్రకటించిన వివరాల ప్రకారం.. ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన జట్టుకు దాదాపు రూ. 19.48 కోట్లు ($2.24 మిలియన్) లభిస్తాయి. ఫైనల్లో ఓడిపోయిన జట్టు రూ. 9.74 కోట్లు ($1.12 మిలియన్) పొందుతుంది.

సెమీఫైనలిస్టులకు కూడా భారీ ప్రైజ్‌మనీ

ఈసారి ఛాంపియన్స్ ట్రోఫీ సెమీఫైనలిస్ట్‌లకు కూడా భారీ ప్రైజ్‌మనీ లభించనుంది. సెమీస్‌లో ఓడిన జట్లు ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా రూ. 4.87 కోట్లు ($5,60,000) చొప్పున పొందుతాయి. ఈసారి గ్రూప్ దశ నుంచి నిష్క్రమించిన జట్లకు కూడా ప్రైజ్‌మనీ లభిస్తుంది.

ఐదు, ఆరు స్థానాల్లో నిలిచిన ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్‌కు రూ. 3.04 కోట్లు ($3,50,000) లభిస్తాయి. ఏడు, ఎనిమిది స్థానాల్లో నిలిచే పాకిస్తాన్, ఇంగ్లండ్ జట్లకు సుమారు రూ. 1.22 కోట్లు ($1,40,000) లభిస్తాయి. ఈ ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీ కోసం ఐసీసీ సుమారు రూ. 60 కోట్లు ($6.9 మిలియన్లు) కేటాయించింది. 2017 ఛాంపియన్స్ ట్రోఫీతో పోలిస్తే ఇది 53 శాతం అధికం.

అజేయ భారత్

ఈ టోర్నీలో టీమిండియా అజేయ జట్టుగా ఫైనల్‌కు చేరింది. భారత్.. గ్రూప్ దశలో బంగ్లాదేశ్, పాకిస్తాన్, న్యూజిలాండ్‌నూ సూపర్ విక్టరీలు సాధించి సెమీస్‌కు చేరింది. సెమీస్‌లో ఆసీస్‌ను మట్టికరిపించి ఫైనల్‌కు చేరింది. మరోవైపు న్యూజిలాండ్ గ్రూప్ దశలో పాకిస్తాన్, బంగ్లాదేశ్‌పై విజయాలు సాధించి, భారత్ చేతిలో ఓడింది. అయినా గ్రూప్-ఏలో రెండో స్థానంలో నిలిచి సెమీస్‌కు చేరింది. సెమీస్‌లో కివీస్ సౌతాఫ్రికాను చిత్తు చేసి తుది పోరుకు అర్హత సాధించింది.

రెండోసారి

ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో న్యూజిలాండ్ భారత్‌ను ఎదుర్కోవడం ఇది రెండోసారి. 2000 ఎడిషన్ ఫైనల్లో కివీస్ భారత్‌ను ఢీకొట్టి విజేతగా నిలిచింది. న్యూజిలాండ్‌కు అది తొలి ఐసీసీ టైటిల్. ఐసీసీ టోర్నీల్లో న్యూజిలాండ్ సాధించిన రెండో టైటిల్ కూడా భారత్‌పైనే (ఫైనల్స్) కావడం గమనార్హం. 2019-2021 డబ్ల్యూటీసీ ఫైనల్లో న్యూజిలాండ్ భారత్‌ను ఓడించి తమ రెండో ఐసీసీ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఐసీసీ ఫైనల్స్‌లో న్యూజిలాండ్‌పై భారత్‌కు మంచి ట్రాక్ రికార్డు లేకపోవడంతో భారత అభిమానులు ఆందోళన పడుతున్నారు.

# ఆర్సీబీకి ఆడాలని ఆరాటపడుతున్న పాక్ ఫాస్ట్ బౌలర్

స్పోర్ట్స్ న్యూస్ ,08 మార్చి (క్రాంతిన్యూస్ ): పాకిస్తాన్ ఫాస్ట్ బౌలర్ మొహమ్మద్ అమీర్ ఐపీఎల్ ఆడాలని తెగ ఆరాటపడిపోతున్నాడు. ప్రత్యేకించి ఐపీఎల్‌లో ఆర్సీబీకి ప్రాతినిథ్యం వహించాలని కలలు కంటున్నాడు. భారత్‌తో దౌత్యపరమైన సంబంధాలు సరిగ్గా లేని కారణంగా పాక్ ఆటగాళ్లకు ఐపీఎల్‌లో ఎంట్రీ లేని విషయం తెలిసిందే. అయితే అమీర్ బ్రిటన్ పౌరసత్వం పొంది తన ఐపీఎల్ కల నెరవేర్చుకోవాలని ఆశిస్తున్నాడు. అమీర్‌కు 2026 నాటికి యూకే పాస్ట్‌పోర్ట్ వస్తుంది. అప్పుడు ఐపీఎల్ వేలంలో తన పేరును రిజిస్టర్ చేసుకోవాలని అనుకుంటున్నాడు.



విరాట్ అంటే అమితమైన అభిమానం :ఎడమ చేతి వాటం ఫాస్ట్ బౌలర్ అయిన అమీర్‌కు విరాట్ కోహ్లి అంటే అమితమైన అభిమానం. ఈ విషయాన్ని అమీర్ చాలా సందర్భాల్లో చెప్పాడు. 2016 టీ20 ప్రపంచకప్‌కు ముందు కోహ్లి తనకు బ్యాట్‌ను బహుమతిగా ఇచ్చిన విషయాన్ని అమీర్ ఇటీవల ఓ ఇంటర్వ్యూ సందర్భంగా గుర్తు చేసుకున్నాడు. ఇదే సందర్భంగా అమీర్ కోహ్లిపై ప్రశంసల వర్షం కురిపించాడు. కోహ్లి ప్రతిభను ఆరాధించే వ్యక్తి అని కొనియాడాడు. కోహ్లి తనకు బ్యాట్ ఇచ్చినప్పుడు ఉప్పొంగిపోయానని చెప్పుకొచ్చాడు. తాను కోహ్లి బ్యాటింగ్‌ను ఆరాధిస్తానని.. కోహ్లి తన బౌలింగ్‌ను గౌరవిస్తాడని తెలిపాడు. కోహ్లి ఇచ్చిన బ్యాట్‌తో చాలా మంచి ఇన్నింగ్స్‌లు ఆడానని గుర్తు చేసుకున్నాడు.

అమీర్ ఆర్సీబీలో చేరితే ఆ జట్టు టైటిల్ కల నెరవేరుతుందని మరో పాకిస్తాన్ ఆటగాడు అహ్మద్ షెహజాద్ అభిప్రాయపడ్డాడు. ఆర్సీబీ బౌలింగ్ సమస్యలు పరిష్కరించడానికి అమీర్ లాంటి బౌలర్ అవసరమని షెహజాద్ అన్నాడు. ఆర్సీబీ బ్యాటింగ్ ఎల్లప్పుడూ బలంగా ఉంది. వారికి బౌలింగే పెద్ద సమస్య. అమీర్ వారితో చేరితే వారు టైటిల్ గెలుస్తారని షెహజాద్ జోస్యం? చెప్పాడు.

# ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు ముందు విరాట్‌కు గాయం..?



స్పోర్ట్స్ న్యూస్ ,08 మార్చి (క్రాంతిన్యూస్ ): ఛాంపియన్స్ ట్రోఫీ-2025 ఫైనల్ మ్యాచ్‌కు ముందు టీమిండియా స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లి గాయమైనట్లు తెలుస్తుంది. శనివారం ప్రాక్టీస్ సెషన్ సందర్భంగా విరాట్ గాయపడినట్లు జియో న్యూస్ తెలిపింది. నెట్స్‌లో ఓ పేసర్‌ను ఎదుర్కొనే క్రమంలో విరాట్ మోకాలికి గాయమైనట్లు సమాచారం?. గాయపడిన అనంతరం విరాట్ ప్రాక్టీస్‌ను ఆపేసినట్లు తెలుస్తుంది. విరాట్ గాయానికి ఫిజియో చికిత్స చేశాడని సమాచారం.

చికిత్స తర్వాత విరాట్ డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లకుండా మైదానంలోనే సహచరులతో గడిపినట్లు తెలుస్తుంది. విరాట్ గాయంపై కోచింగ్ స్టాఫ్‌ను ఆరా తీయగా తీవ్రమైంది కాదని పేర్కొన్నట్లు తెలుస్తుంది. ప్రాక్టీస్ సెషన్‌లో విరాట్ మోకాలికి కట్టు కట్టుకుని తిరిగినట్లు జియో న్యూస్ పేర్కొంది.

విరాట్ గాయం గురించి తెలిసి అభిమానులు తొలుత ఆందోళన చెందారు. విరాట్ గాయంపై టీమిండియా మేనేజ్‌మెంట్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఫైనల్లో విరాట్ ఎంత కీలకమైన ఆటగాడో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ఒకవేళ స్వల్ప గాయమైనా ముందు జాగ్రత్త చర్చగా విరాట్‌ను ప్రాక్టీస్ చేయనిచ్చి ఉండరు.

ఈ టోర్నీలో విరాట్ అత్యంత కీలకమైన ఇన్నింగ్స్‌లు ఆడి టీమిండియా ఫైనల్‌కు చేరడంలో ముఖ్యపాత్ర పోషించాడు. ఈ టోర్నీలో విరాట్ దాయాది పాకిస్తాన్‌పై సూపర్ సెంచరీ చేసి భారత్‌ను గెలిపించాడు. ఆసీస్‌తో జరిగిన సెమీఫైనల్లోనూ విరాట్ మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడాడు. ఈ మ్యాచ్‌లో కూడా విరాట్ సెంచరీ చేసుండాల్సింది. అయితే తృటిలో ఆ అవకాశాన్ని చేజార్చుకున్నాడు.



విరాట్ సూపర్ ఫామ్‌ను ఫైనల్లోనూ కొనసాగించి భారత్‌కు మరో ఐసీసీ టైటిల్ అందించాలని టీమిండియా అభిమానులు కోరుకుంటున్నారు. ఫైనల్లో విరాట్ మంచి ఇన్నింగ్స్ ఆడితే భారత విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరు. దుబాయ్ పిచ్‌లకు విరాట్ అలవాటు పడ్డాడు కాబట్టి ఫైనల్లో తప్పక రాణిస్తాడని అంతా అనుకుంటున్నారు.

కాగా, దుబాయ్ వేదికగా నేడు జరుగబోయే ఫైనల్లో టీమిండియా న్యూజిలాండ్‌తో అమీతుమీ తేల్చుకోనున్న విషయం తెలిసిందే. ఈ టోర్నీలో టీమిండియా అజేయ జట్టుగా ఫైనల్‌కు చేరింది. భారత్.. గ్రూప్ దశలో బంగ్లాదేశ్, పాకిస్తాన్, న్యూజిలాండ్‌నూ సూపర్ విక్టరీలు సాధించి సెమీస్‌కు చేరింది. సెమీస్‌లో ఆసీస్‌ను మట్టికరిపించి ఫైనల్‌కు చేరింది.

మరోవైపు న్యూజిలాండ్ గ్రూప్ దశలో పాకిస్తాన్, బంగ్లాదేశ్‌పై విజయాలు సాధించి, భారత్ చేతిలో ఓడింది. అయినా గ్రూప్-ఏలో రెండో స్థానంలో నిలిచి సెమీస్‌కు చేరింది. సెమీస్‌లో కివీస్ సౌతాఫ్రికాను చిత్తు చేసి తుది పోరుకు అర్హత సాధించింది.

ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో న్యూజిలాండ్ భారత్‌ను ఎదుర్కోవడం ఇది రెండోసారి. 2000 ఎడిషన్ ఫైనల్లో కివీస్ భారత్‌ను ఢీకొట్టి విజేతగా నిలిచింది. న్యూజిలాండ్‌కు అది తొలి ఐసీసీ టైటిల్. ఐసీసీ టోర్నీల్లో టీమిండియాను న్యూజిలాండ్‌పై అంత మంచి ట్రాక్ రికార్డు లేదు. ఈ టోర్నీలో భారత్ న్యూజిలాండ్‌ను గ్రూప్ దశలో ఓడించినప్పటికీ.. ఫైనల్లో ఓడించడం మాత్రం అంత ఈజీ కాదు.

ఐసీసీ ఈవెంట్లలో (అన్ని ఫార్మాట్లలో) న్యూజిలాండ్ భారత్‌తో ఆడిన 16 మ్యాచ్‌ల్లో పదింట గెలిచింది. ఐసీసీ నాకౌట్ మ్యాచ్‌ల్లో భారత్‌పై న్యూజిలాండ్‌కు మరింత ఘనమైన ట్రాక్ రికార్డు ఉంది. ఐసీసీ నాకౌట్స్‌లో భారత్, న్యూజిలాండ్ నాలుగు సార్లు ఎదురెదురుపడగా.. 3 మ్యాచ్‌ల్లో కివీస్, ఒక మ్యాచ్‌లో భారత్ గెలుపొందాయి.

న్యూజిలాండ్ తమ చరిత్రలో గెలిచిన రెండు ఐసీసీ టైటిళ్లు భారత్‌పైనే (ఫైనల్స్‌లో) సాధించినవే కావడం గమనార్హం. 2000 ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత న్యూజిలాండ్ తమ రెండో ఐసీసీ టైటిల్‌ను 2021లో సాధించింది. 2019-2021 డబ్ల్యూటీసీ ఫైనల్లో న్యూజిలాండ్ భారత్‌ను ఓడించి తమ రెండో ఐసీసీ టైటిల్‌ను ఎగరేసుకుపోయింది.

క్రాంతి KR TV
ఆదివారం 09 మార్చి 2025
సినిమా న్యూస్
epaper.krtvnews.com

# 'కోర్ట్..' నచ్చకపోతే..

## నా 'హిట్ 3'ని ఎవరూ చూడకండి: నాని



మూవీ న్యూస్ ,08 మార్చి (క్రాంతిన్యూస్ ): "ఈ రోజుల్లో సినిమాల్లోకి దూరిపోయి.. అందులోని పాత్రల ఎమోషన్‌తో కనెక్ట్ అయిపోయి.. వాటితో పాటు నవ్వి, ఏడ్చి.. ఆ చిత్ర ప్రపంచాల్లోకి తీసుకెళ్లే కథలు బాగా తగ్గిపోయాయి. కానీ, అలాంటి అనుభూతిని 'కోర్ట్'తో నేను పొందగలిగా. ఇప్పుడా అనుభూతినే ప్రేక్షకులు పొందాలన్నది నా తాపత్రయం. అందుకే ఈ నెల 14న 'దయచేసి థియేటర్‌కు వెళ్లండ'ని అడుగుతున్నా. ఇది కచ్చితంగా తెలుగులో ఓ గొప్ప కోర్ట్ రూం డ్రామాగా నిలిచిపోతుంది" అన్నారు కథానాయకుడు, నిర్మాత నాని . ఇప్పుడాయన సమర్పణలో ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'కోర్ట్: స్టేట్ వర్సెస్ ఎ నోబడీ'. రామ్ జగదీశ్ తెరకెక్కించారు. ప్రశాంతి తిపిర్నేని నిర్మాత. హర్ష్ రోషన్, శ్రీదేవి జంటగా నటించారు. శివాజీ, సాయికుమార్, రోహిణి, హర్ష వర్ధన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 14న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన ప్రీరిలీజ్ వేడుకలో ఈ చిత్ర ట్రైలర్‌ను నాని విడుదల చేశారు. దీంట్లో ఆయనతో పాటు దర్శకులు మోహనకృష్ణ ఇంద్రగంటి, నాగ్ అశ్విన్, ప్రశాంత్ వర్మ, శ్రీకాంత్ ఓదెల, శైలేశ్ కొలను, శౌర్యువ్ తదితరులు అతిథులుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా చిత్ర సమర్పకుడు నాని మాట్లాడుతూ.. "నా 16ఏళ్ల సినీ కెరీర్‌లో 'దయ చేసి ఈ సినిమా చూడండి' అని నేనెప్పుడూ అడిగింది లేదు. కానీ, ఈ చిత్ర విషయంలో ఆ మాట అడుగుతున్నా. ఎందుకంటే ఇలాంటి మంచి సినిమాని తెలుగు ప్రేక్షకులెవరూ మిస్సవ్వకూడదని నా కోరిక. అందుకే ఇంతగా బతిమలాడుతున్నా. ఇది మీ అంచనాల్ని అందుకోలేదు అనిపిస్తే మరో రెండు నెలల్లో విడుదల కానున్న నా 'హిట్ 3'ని ఎవరూ చూడొద్దు. ఇంతకంటే బలంగా నేనేమీ చెప్పలేను. ఎందుకంటే దీనికన్నా 10రెట్లు ఎక్కువగా 'హిట్ 3'పై ఖర్చు పెట్టా. ఈ నెల 14వరకే 'ఈ సినిమా చూడమ'ని నేను అందరికీ చెప్తా. ఆ తర్వాత నుంచి మీరే ఆ మాట ప్రతి ఒక్కరికీ చెప్తారు" అన్నారు. ఈ కార్యక్రమంలో శివాజీ, దీప్తి గంటా, ప్రశాంతి, విజయ్ బుల్గానిన్, శ్రీదేవి, రోహిణి, సురభి ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు సాధించాల్సింది ఎంతో ఉంది:



మూవీ న్యూస్ ,08 మార్చి (క్రాంతిన్యూస్ ): ఐఫా వేడుకలకు జైపుర్ సిద్ధమైంది. ఇప్పటికే అగ్రతారలు అక్కడికి చేరుకున్నారు. తాజాగా ఆ వేడుకలో పాల్గొన్న మాధురీ దీక్షిత్ మహిళా దినోత్సవం సందర్భంగా సినీరంగంలో మహిళల పారితోషికాల్లో వ్యత్యాసంపై చర్చించారు. మహిళలు సాధించాల్సింది ఇంకా ఎంతో ఉందన్నారు. ఆస్కార్ అవార్డు గ్రహీత నిర్మాత గునీత్‌తో కలిసి 'ది జర్నీ ఆఫ్ సినిమా' సెషన్‌లో మాధురీ మాట్లాడారు.

సినిమాల్లో నటీనటుల వేతనాల గురించి మాధురీ ప్రస్తావిస్తూ.. "మహిళల విషయంలో వారు తమను తాము పదేపదే నిరూపించుకోవాల్సి వస్తోంది. మనం కూడా ప్రేక్షకులను అగ్ర హీరోల వలే ఆకర్షించగలం. కానీ, మనం దానిని ప్రతిసారీ నిరూపించుకోవాల్సి వస్తోంది. అలాగే పారితోషికం విషయంలోనూ ఇంకా అసమానతలు ఉన్నాయి. వాటిని అధిగమించాలి" అని చెప్పారు. నిర్మాత గునీత్ మాట్లాడుతూ.. "సినీరంగంలోని వేతన వ్యత్యాసం గురించి నటులు సమాధానం చెప్పాలని నేను కోరుకుంటున్నాను. మహిళలు ఇప్పటికే ఎన్నో అవకాశాలు కోల్పోయారు. మన అవకాశాలను మనమే సృష్టించుకోవాలి. 'స్త్రీ2' లాంటి చిత్రాలు మరిన్ని రావాలి. అలాంటివి తెరకెక్కిస్తేనే మహిళలకు మరింత గుర్తింపు వస్తుంది" అని అన్నారు.

# టాలీవుడ్‌లోకి మరో బాలీవుడ్ బ్యూటీ ఎంట్రీ



మూవీ న్యూస్ ,08 మార్చి (క్రాంతిన్యూస్ ): తెలుగు చిత్రాల్లో నటించేందుకు వివిధ పరిశ్రమలకు చెందిన తారలు ఆసక్తి చూపిస్తోన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే బాలీవుడ్‌కు చెందిన దీపికా పదుకొణె, జాన్వీకపూర్, అనన్యపాండే వంటి తారలు ఇప్పటికే తెలుగు సినిమాల్లో నటించి ప్రేక్షకులను అలరించారు. వీరి జాబితాలోకి ఇప్పుడు సోనాక్షిసిన్హా వచ్చి చేరారు.విభిన్నమైన చిత్రాలతో బీటౌన్‌లో హీరోయిన్‌గా గుర్తింపుతెచ్చుకున్నారు సోనాక్షి సిన్హా. ఇటీవల 'హీరామండి'తో అలరించిన ఆమె టాలీవుడ్ ఎంట్రీకి రంగం సిద్ధమైంది. సుధీర్‌బాబు హీరోగా నటిస్తోన్న 'జటాధర'తో నటిగా ఆమె తెలుగులోకి అడుగుపెడుతున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్రబృందం శనివారం స్పెషల్ పోస్టర్ షేర్ చేసింది. ప్రస్తుతం ఇది సినీప్రియుల దృష్టిని ఆకర్షిస్తోంది. పాన్ ఇండియా మూవీగా ఇది సిద్ధమవుతోంది. వెంకట్ కల్యాణ్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రేరణ అరోరా సమర్పణలో సుధీర్‌బాబు ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మితమవుతోంది. 'శాస్త్రీయ, పౌరాణిక అంశాల మేళవింపుతో ఈ కథను రాశారు. ఈ రెండు జానర్స్‌కు చెందిన ప్రపంచాల్ని వెండితెరపై చూస్తున్నప్పుడు ప్రేక్షకులు ఓ సరికొత్త అనుభూతిని పొందుతారు' అని గతంలో ఈ ప్రాజెక్ట్‌ను ఉద్దేశించి సుధీర్ బాబు చెప్పారు.

# మరోసారి 'వైజయంతి'గా విజయశాంతి

మూవీ న్యూస్ ,08 మార్చి (క్రాంతిన్యూస్ ): కల్యాణ్ రామ్ కొత్త మూవీకి టైటిల్ ఫిక్స్ చేశారు. గత కొన్నిరోజుల నుంచి అనుకుంటున్నట్లే ఓ పేరుని టైటిల్ గా అధికారికంగా ఇప్పుడు ప్రకటించారు. ఈ మేరకు క్రేజీ ఫస్ట్ లుక్ ని విడుదల చేశారు. ఇందులో విజయశాంతి కీలక పాత్రలో నటిస్తున్నారు.



'బింబిసార'తో హిట్ కొట్టిన కల్యాణ్ రామ్.. దీని తర్వాత రెండు ఫ్లాప్స్ చవిచూశాడు. దీంతో కాస్త గ్యాప్ తీసుకుని ఓ మూవీ చేస్తున్నాడు. ఇందులో విజయశాంతి కీలక పాత్ర పోషిస్తుండటంతో అంచనాలు ఏర్పడ్డాయి. ఇప్పుడు వీళ్లిద్దరూ తల్లికొడుకులుగా నటిస్తున్నారని క్లారిటీ వచ్చింది. ఈ మేరకు 'అర్జున్ సన్నాఫ్ వైజయంతీ' అనే టైటిల్ పోస్టర్ రిలీజ్ చేశారు. పోలీస్ డ్రస్సులో విజయశాంతి, పక్కనే కల్యాణ్ రామ్ నడుస్తున్నట్లు ఉన్న లుక్ ఆకట్టుకుంటోంది. 'ప్రతి స్త్రీ ఒక కొడుకును పెంచుకుంటుంది. వైజయంతి ఐపీఎస్ ఇక్కడ అర్జున్ అనే సైన్యాన్ని పోషిస్తోంది" అని పేర్కొన్నారు. .

గతంలోనూ విజయశాంతి.. వైజయంతి పేరుతో ఓ సినిమా చేశారు. అందులో ఆర్మీ ఆఫీసర్ కాగా.. ఇప్పుడు పోలీస్ గా నటిస్తున్నారు. ఇందులో కల్యాణ్ రామ్ సరసన సయీ మంజ్రేకర్ హీరోయిన్. ప్రదీప్ చిలుకూరి దర్శకుడు. త్వరలో రిలీజ్ వివరాలు వెల్లడిస్తారు.



# ప్రేమించే ముందు జాగ్రత్త వహించాలి!

మూవీ న్యూస్ ,08 మార్చి (క్రాంతిన్యూస్ ): అందంతో సినీ ప్రియులను ఆకట్టుకుంటూ తనకంటూ ఓ ప్రత్యేక క్రేజ్ సంపాదించుకున్న కథానాయిక తమన్నా ఇప్పుడామె తన ప్రియుడు విజయ్ వర్మతో విడిపోతున్నట్లు వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే గతంలో ఓ పాడ్‌కాస్ట్‌లో ప్రేమ గురించి తమన్నా మాట్లాడిన పలు విషయాలు ప్రస్తుతం నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి . "ప్రేమ, రిలేషన్‌షిప్ అంటే ఏమిటి? అనేదానికి మనమందరం అయోమయానికి గురవుతుంటాం. కానీ ప్రేమ అనేది మనసుకు సంబంధించినది. దానికి ఎలాంటి షరతులు వర్తించవు. అలాగే రిలేషన్‌షిప్ కూడా ఒకరిపై ఒకరికి ఎలాంటి అంచనాలు లేకుండా ఉన్నప్పుడే అది రిలేషన్‌షిప్ అవుతుంది. ఒకవేళ అవతలి వ్యక్తి నుంచి మీరేమైనా కోరుకుంటున్నారు అంటే అప్పుడది వ్యాపారం అవుతుంది . ఎవరి అభిప్రాయాలు వారికి ఉంటాయి. ఒకవేళ ఎవరినైనా ప్రేమించినా వారిని వాళ్లలా ఉండనీయాలి. అలాగే ప్రేమించే వ్యక్తిని ఎంచుకోవడంలో కూడా జాగ్రత్త వహించాలి' అంటూ ఆమె చెప్పుకొచ్చారు.

Printed, Published and owned by ---------------------, Printed at ---------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com